



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 96 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 29 డిసెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-




### సుపరిపాలనకు రామరాజ్యమే

# బెంచ్ మార్క్



- దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా అయోధ్య
- అయోధ్యలో శ్రీరామచంద్రణ్ని దర్శించుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**అయోధ్య, విశ్వం వాయిస్ న్యూస్ :** సుపరిపాలనకు రామరాజ్యమే బెంచ్ మార్క్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. మంచి పరిపాలనను రామరాజ్యంతోనే పోల్చుకుంటామని అన్నారు. ఆదివారం అయోధ్యలో శ్రీరాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అత్యుత్తమ పాలనకు రాముడి పాలనే కొలమానంగా తీసుకుంటామని అన్నారు. అయోధ్యలో నిర్మించిన రామమందిరం మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఎన్నో వివాదాల అనంతరం ఆలయం నిర్మితమై దేశ ప్రజల కల సాకారమైందన్నారు. భారత్‌లో ఆధ్యాత్మిక కేంద్రంగా అయోధ్య రామాలయం మారిందని అన్నారు. ఆలయ నిర్మాణంతో పాటు యూపీలో సుపరిపాలన అందిస్తున్న యోగీ ఆదిత్య నాథ్ ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. దేశంలోని ఇతర మిగతా .. 2లో..

### ప్రపంచంలో విద్య ఒక్కటే

# అభివృద్ధికి రాజమార్గం

- ప్రపంచ స్థాయిలో భారతదేశానికి గుర్తింపు, కీర్తి ప్రతిష్టలు తెచ్చేవి విద్య, క్రీడలు మాత్రమేనని వీటిపై యువత ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరాన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యం

కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్



**పశ్చిమగోదావరి జిల్లా (నరసాపురం), విశ్వం వాయిస్ న్యూస్ :** నరసాపురం మండలం పెదమైనవాని లంక గ్రామంలో ఆదివారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో యూనియన్ బ్యాంకు వారి సహకారంతో రూ.18 లక్షలు విలువచేసే కంప్యూటర్లు, సైన్సు ల్యాబ్లు, తదితర మౌలిక సదుపాయాలు ప్రారంభించి, కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ విద్యార్థులకు అంకితం చేశారు. కేంద్ర ఆర్థిక శాఖామంత్రితో పాటు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పి.వి.యన్.మాధవ్, జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, తణుకు ఎమ్మెల్యే ఆరుమిల్లి రాధాకృష్ణ, తాడేపల్లిగూడెం మిగతా .. 2లో..

### 2025లో భారత్

# గర్వించదగిన క్షణాలివే : ప్రధాని మోదీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** 'మన్‌కీ బాత్' కార్యక్రమం 129వ ఎపిసోడ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఇందులో భాగంగా 2025లో భారతదేశం గర్వించదగిన క్షణాలను ఆయన గుర్తు చేసుకున్నారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ ప్రపంచ దేశాలకు తన బలాన్ని చూపించిందని.. దేశ భద్రతపట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. దేశంలోని ప్రతిపౌరుడికి ఈ ఆపరేషన్ గర్వకారణంగా మారిందన్నారు. 'వందేమాతరం' 150 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పుడు కూడా దేశ ప్రజల్లో ఇదే స్ఫూర్తి కనిపించిందని పేర్కొన్నారు. క్రీడల పరంగా కూడా ఈ ఏడాది చిరస్మరణీయమని మోదీ పేర్కొన్నారు. 12 ఏళ్ల తర్వాత టీమ్‌ఇండియా పురుషుల క్రికెట్ జట్టు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని సొంతం చేసుకుందని.. మహిళల క్రికెట్ జట్టు మొదటిసారి వన్డే ప్రపంచ కప్‌ను గెలుచుకుందన్నారు. మహిళల అంధుల జట్టు టీ20 ప్రపంచ కప్‌ను గెలుచుకొని చరిత్ర సృష్టించిందని గుర్తు చేసుకున్నారు. అంతరిక్ష రంగంలోనూ ఈ ఏడాది భారత్ తన ప్రతిభను చాటుకుందని అన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన శుభాన్షు శుక్లాను ప్రశంసించారు. కోట్ల మంది పాల్గొన్న మహా కుంభమేళాను భారత్ దిగ్విజయంగా నిర్వహించి, ప్రపంచ దేశాలను ఆశ్చర్యపరిచిందని మోదీ పేర్కొన్నారు. అయోధ్య రామాలయంలో జరిగిన ధ్వజారోహణ కార్యక్రమం ప్రతి హిందువు గర్వపడేలా చేసిందని అభిప్రాయపడ్డారు. ఈ ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అనేక పథకాలు, ఇతర విషయాలను గుర్తు చేసుకున్నారు. 2025లో దేశ ప్రజలు ఏ విధంగా ఐక్యతతో, సామరస్యంగా ఉన్నారో అదే విధంగా కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాలని పిలుపునిచ్చారు. నూతన సంవత్సరంలో దేశాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

**మోదీ నోట నరసాపురం లేస్ క్రాఫ్ట్ మాట..**

మన్‌కీబాత్‌లో ప్రధాని మాట్లాడుతూ నరసాపురం లేస్ క్రాఫ్ట్ గురించి ప్రస్తావించారు. ప్రస్తుత మార్కెట్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని నరసాపురం లేస్ క్రాఫ్ట్ చర్చనీయాంశంగా మారిందన్నారు. తరతరాల నుంచి మహిళలే ఈ అరుదైన కళను కాపాడుతూ వస్తున్నారన్నారు. ఏపీ ప్రభుత్వం నాబార్డ్‌తో కలిసి లేస్ క్రాఫ్ట్ కళాకారులకు కొత్త డిజైన్లు, నైపుణ్యాలు మిగతా .. 2లో..

# పాక్‌కు అమెరికా ఆఫర్..

### ఖనిజాన్వేషణలో కలిసి పనిచేసే అవకాశం



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-పాకిస్థాన్ వాణిజ్య బంధం మరింత బలపడుతోంది. ఈ క్రమంలో అమెరికా తన లోకోమోటివ్ రైళ్లను పాక్‌కు విక్రయించేందుకు సన్నాహాలు చేపట్టినట్లు తెలుస్తోంది. దీంతోపాటు పాకిస్థాన్‌లో అరుదైన ఖనిజాల అన్వేషణకు కూడా సమష్టిగా కృషి చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని పాక్ పత్రిక ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ తన కథనంలో పేర్కొంది. ఈ ఏడాది అక్టోబర్‌లో పాక్ ఆర్థిక మంత్రి మహమ్మద్ ఔరంగజేబు వాషింగ్టన్‌ను సందర్శించినప్పుడు వీటిపై చర్చలు మొదలయ్యాయి. ఆ తర్వాత నుంచి అమెరికాకు ప్రయోజనాలు కల్పించేలా పాక్ అధికారులు చర్చలు చేపట్టారు. అధ్యక్షుడు ట్రంప్‌నకు సలహాదారు అయిన రేమాండ్ ఎమోరి కాక్స్, అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల విషయంలో సలహాదారు అయిన రికీ గిల్ స్వయంగా పాక్‌తో చర్చలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అమెరికా తయారీ లోకోమోటివ్‌లను పాక్ కొనుగోలు చేయాలని గిల్ కోరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పాక్ ఆ దేశం తయారీ 55 లోకోమోటివ్‌లను వాడుతోంది. కాకపోతే ప్రస్తుతం పాక్ రైల్వే వద్ద తగినంత నగదు లేదు. స్టార్‌లింక్ ఇంటర్నెట్ అనుమతులను కూడా సానుకూలంగా పరిశీలించాలని కూడా రికీ గిల్ కోరినట్లు సమాచారం. ఈ క్రమంలో అమెరికన్ కంపెనీలపై పాకిస్థాన్ 5 శాతం డిజిటల్ పన్నును కూడా తొలగించింది. ఖనిజాల రంగంలో మిగతా .. 2లో..

### అలిపిరి మెట్ల మార్గంలో

# ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ప్రారంభం



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** అలిపిరి మెట్లమార్గంలో 7వ మైలు వద్ద ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీవారి దర్శనానికి మెట్ల మార్గంలో వచ్చే భక్తుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని దీన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా త్వరితగతిన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. అనారోగ్యానికి గురై అత్యవసర పరిస్థితులు వచ్చినపుడు ఈ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. తితిదే, అపోలో వైద్యులతో పాటు శిక్షణ పొందిన మిగతా .. 2లో..

# ఐ-బొమ్మ నిర్వాహకుడు రవి కేసులో కీలక పరిణామం



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఐ-బొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రహ్లాద్ వెల్లేల పేరుతో రవి.. పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నాడు. అతను తన రూమ్‌మేట్ అని గతంలో పోలీసు విచారణ సందర్భంగా చెప్పాడు. దీంతో బెంగళూరు నుంచి ప్రహ్లాద్‌ను పిలిపించిన పోలీసులు.. కస్టడీలో ఉన్న ఇమంది రవి ఎదుటే అతన్ని విచారించారు. "ఇమంది రవి ఎవరో నాకు తెలియదు. నా పేరుతో రవి పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నట్టు తెలిసి షాక్ అయ్యా" అని ప్రహ్లాద్ పోలీసులకు చెప్పినట్టు సమాచారం. ప్రస్తుతం అతను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ప్రహ్లాద్ డాక్యుమెంట్లు ఇమంది రవి దొంగిలించినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. రేపటితో ఇమంది రవి పోలీసు కస్టడీ ముగియనుంది.

# కాంగ్రెస్ మరింత బలోపేతం కావాలి..

### దిగ్విజయ్‌కు శశిథరూర్ మద్దతు



**విశ్వం వాయిస్ న్యూస్ :** భాజపా-ఆరెస్సెస్‌లకు ఉన్న సంస్థాగత బలాన్ని కొనియాడుతూ.. కాంగ్రెస్ శక్తిమంతం కావాల్సి ఉందంటూ ఆ పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతోంది. ఈ క్రమంలోనే దిగ్విజయ్ వ్యాఖ్యలకు ఆ పార్టీకి చెందిన మరో నేత శశిథరూర్ మద్దతు పలికారు. కాంగ్రెస్ 140వ వ్యవస్థాపక దినోత్సవం జరుపుకుంటున్న నేపథ్యంలో థరూర్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. దిగ్విజయ్ వ్యాఖ్యలను మిగతా .. 2లో..

# హాదీ హంతకులు రాలేదు.. అవన్నీ నిరాధార ఆరోపణలే..

### బంగ్లాదేశ్ ప్రకటనపై బీఎస్ఎఫ్

**విశ్వం వాయిస్ న్యూస్ :** బంగ్లాదేశ్ విద్యార్థి నేత హాదీ హత్య కేసులో ప్రధాన అనుమానితులుగా ఉన్న ఫైసల్ కరీం మసూద్, అలంగీర్ షేక్ భారత్‌కు పారిపోయినట్లు ఢాకా మెట్రోపాలిటన్ పోలీసులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రకటనను బీఎస్ఎఫ్ అధికారులు, మేఘాలయ పోలీసులు ఖండించారు. సరిహద్దు భద్రతా దళం (మేఘాలయ) స్పందిస్తూ.. అంతర్జాతీయ సరిహద్దును దాటి ఎవరూ భారత్‌లోకి వచ్చినట్లు ఆధారాలు లేవని వెల్లడించింది. సరిహద్దుల్లో తమ బలగాలు నిరంతరం మిగతా .. 2లో..



# సిందూర్' వేళ బంకర్లో దాక్కోమన్నారు..

### పాక్ అధ్యక్షుడి అంగీకారం



**విశ్వం వాయిస్ న్యూస్ :** పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా పాకిస్థాన్‌పై భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అక్కడ అగ్ర నాయకత్వానికి వణుకు పుట్టినట్లు తెలిసింది. భారత్ ఆపరేషన్ నేపథ్యంలో బంకర్‌లోకి వెళ్లిపోవాలని తమ సైన్యం సూచించిన మాట వాస్తవమేనని పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ అంగీకరించారు. ఇటీవల ఓ బహిరంగ సభలో ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు. "మిలటరీ మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## సుపరిపాలనకు రామరాజ్యమే బెంచ్ మార్క్

దేవాలయాలకు అయోధ్య రామాలయం మార్గదర్శకంగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. సాంకేతికంగా ముందుడుగు వేస్తున్న భారత్‌ను ఎవరూ నిలువరించలేరని స్పష్టం చేశారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యంలో యూపీ, బీహార్‌లు కూడా కీలక పాత్ర పోషించాలని అన్నారు. శ్రీ రాముడి దర్శనం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌లో స్పందించారు. 'శ్రీ రాముడు పాటించిన విలువలు కాలానికి అతీతంగా ఎప్పుడూ స్ఫూర్తినిస్తుంటాయి. రాముడు పాటించిన విలువలు సుపరిపాలనకు నిరంతరం మార్గదర్శంగా నిలుస్తాయి. అయోధ్యలో శ్రీరామ దర్శనం నాకు నూతన శక్తిని ఇచ్చింది' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

## అభివృద్ధికి రాజమార్గం

్య బొలిశెట్టి శ్రీనివాస్, ఏపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థిని, విద్యార్థులతో మమేకమై వారితో కొద్దిసేపు కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ముచ్చటించారు. కొన్ని ప్రశ్నలు వేసి సమాధానం రాబట్టారు. డిజిటల్ క్లాసులు ద్వారా ప్రపంచలో జరుగుచున్నవాటిని, ఉన్నత విద్యా ప్రమాణాలు చక్కగా తెలుసు కోవచ్చునని, ప్రతి విద్యార్థి హాజరు అయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ విద్యార్థిని, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తీరప్రాంత యువతీ, యువకులు ఉన్నత చదువులు చదివి దేశానికి, రాష్ట్రానికి మంచి సేవలు అందించాలని అన్నారు. తీర ప్రాంతానికి ఏమి కావాలన్నా చెయ్యటానికి సిద్ధంగా ఉన్నామని, మీరు బాగా చదవాలి అని అభివృద్ధి, సంక్షేమం మేము చూసుకుంటామని అన్నారు. చదువుతోపాటు క్రీడల పైన ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రపంచ స్థాయిలో మన భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చేది విద్య, క్రీడలు తోనే సాధ్యమని విద్యార్థులు మంచి ఆలోచనలతో ముందుకు సాగి దేశ భవిష్యత్తు తీర్చిదిద్దే బాధ్యత కూడా యువతదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసి రాజు, డియస్పి డా.జి.శ్రీవేద, యూనియన్ బ్యాంకు యండి ఆశీస్ పాండే, యస్ యల్ బిసి సి.వి.యన్.భాస్కర్, రీజనల్ హెడ్ మన్యం, యస్ యల్ బిసి ఏజియం శ్రీనివాసు, యల్డియం ఏ.నాగేంద్రప్రసాదు, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, నరసాపురం టీడీపీ ఇంచార్చి పొత్తూరి రామరాజు, జిల్లా బిజెపి అధ్యక్షులు అయినంపూడి శ్రీదేవి, కేంద్రమంత్రి ప్రతినిధి పేరాల మోహన్, బ్యాంకు అధికారులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచి కొల్లాటి కనకదుర్గ, హెచ్ యం యం.డి. ఇబ్రాహీమ్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ సి.హెచ్. నరసింహాస్వామి, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు, విద్యార్థిని,విద్యార్థులు వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## గర్వించదగిన క్షణాలివే : ప్రధాని మోదీ

నేర్పిస్తోందని.. ప్రస్తుతం దీని మార్కెట్ వేగంగా విస్తరిస్తోందన్నారు. ప్రభుత్వ మద్దతుతో నరసాపురం ప్రజలు ఈ కళకు కొత్త హంగులను చేర్చి ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. లక్షలమంది మహిళలు ఉపాధి పొందుతున్న ఈ కళకు జీఐ గుర్తింపు కూడా ఉందన్నారు.

## పాక్‌కు అమెరికా ఆఫర్..

పెట్టుబడి పెట్టేందుకు అమెరికా 135 బిలియన్ డాలర్లను సిద్ధం చేసింది. ఈ క్రమంలో బలోచిస్థాన్‌లోని రెకో డిక్ మైనింగ్ కంపెనీకి 1.25 బిలియన్ డాలర్లను తమ దేశ ఎగ్జిమ్ బ్యాంక్ ద్వారా అమెరికా మంజూరు చేయించింది. ఇక పాకిస్థాన్ ఖనిజాల నిల్వలను గుర్తించే విషయంలో, కృత్రిమ మేధ అభివృద్ధిలో అమెరికా-పాక్ కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. ఈ ఏడాది పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ అమెరికా పర్యటనతో ఇరు దేశాల సంబంధాల్లో భారీ మార్పులు చోటు చేసుకొన్నాయి.

## ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ప్రారంభం

పారామెడికల్ బృందం సేవలందిస్తుందని బీఆర్ నాయుడు తెలిపారు. ఈసీజీ యంత్రం, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్, నెబ్యులైజర్‌తో పాటు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరీ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మరింత బలోపేతం కావాలి..

విలేకరులు ప్రస్తావించగా.. తమ సంస్థ బలోపేతం కావాలని తాను కూడా కోరుకుంటున్నట్లు థరూర్ తెలిపారు. దీనిపై ఎలాంటి చర్చ అవసరం లేదన్నారు. ఏ పార్టీలో అయినా క్రమశిక్షణ అవసమర్నారు. 'నేడు పార్టీకి చాలా ముఖ్యమైన రోజు. మనకు 140 ఏళ్ల చరిత్ర ఉంది. దీని నుంచి మనం ఎంతో నేర్చుకోవచ్చు' అని అన్నారు. శనివారం ప్రధాని మోదీకి చెందిన పాత ఫొటోను దిగ్విజయ్ పంచుకున్న సంగతి తెలిసిందే. ఆరెస్సెస్‌లో సామాన్య కార్యకర్త నుంచి ప్రధానిగా మోదీ ఎదిగిన విధానాన్ని ఆయన కొనియాడారు. ఇది భాజపా- ఆరెస్సెస్‌కు ఉన్న సంస్థాగతమైన శక్తి అని అభివర్ణించారు. ఈ పోస్టుపై తర్వాత ఆయన మాట్లాడుతూ.. భాజపా- ఆరెస్సెస్‌కు తాను వ్యతిరేకినన్నారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు.

**సొంత పార్టీ నుంచే వ్యతిరేకత..**

దిగ్విజయ్ వ్యాఖ్యలకు సొంత పార్టీ నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దిగ్విజయ్ అభిప్రాయంతో తాను ఏకీభవించనని ఆ పార్టీ నేత పవన్ ఖేడా అన్నారు. గాడ్సే మద్దతుదారులు.. గాంధీ అభిమానులు కాలేరని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో ఐక్యత లోపించిందనే వాదనలను మరో నేత సచిన్ పైలట్ కొట్టిపారేశారు. కాంగ్రెస్ భారత్‌లో బలమైన ప్రతిపక్షంగా ఉందని.. పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. మరో నాయకురాలు సుప్రియా శ్రీనాతే మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు ఆరెస్సెస్ నుంచి నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు.

## హాదీ హంతకులు రాలేదు.. అవన్నీ నిరాధార ఆరోపణలే..

అప్రమత్తంగా ఉన్నాయని తెలిపింది. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు పొరుగుదేశం ఇటువంటి నిరాధార ఆరోపణలు చేస్తోందని మండిపడింది. బంగ్లాదేశ్ పోలీసులు, అక్కడి మీడియా చేసిన ప్రకటనల్లో నిజం లేదని మేఘాలయ పోలీసులుస్పష్టం చేశారు. ఎవరూ రాష్ట్రంలోకి రాలేదని.. తాము ఎవరినీ అరెస్టు చేయలేదని వెల్లడించారు. ఇవన్నీ భారత్‌పై చేస్తున్న తప్పుడు ఆరోపణలని కొట్టిపడేశారు. భారత ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించేందుకు బంగ్లాదేశ్ మీడియా కల్పిత కథనాలను సృష్టిస్తోందన్నారు. కాగా ఢాకా మెట్రోపాలిటన్ పోలీసులు ఆదివారం ఇచ్చిన మీడియా బ్రీఫింగ్‌లో హాదీ హత్య కేసులో ప్రధాన అనుమానితులుగా ఉన్న ఇద్దరు వ్యక్తులు భారత్‌కు పారిపోయినట్లు తెలిపారని ఆ దేశ మీడియా వర్గాలు వెల్లడించాయి. భారత్‌లో వారికి సహకరించిన వారిని మేఘాలయ పోలీసులు అరెస్టు చేసినట్లు తమకు సమాచారం అందిందని తెలిపాయి.

## సిందూర్' వేళ బంకర్లో దాక్కోమన్నారు..

సెక్రటరీ నా దగ్గరకు వచ్చి ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ దాడులు చేస్తోంది. యుద్ధం ప్రారంభమైంది. బంకర్లోకి వెళ్దాం" అని తనను అప్రమత్తం చేసినట్లు జర్దారీ వెల్లడించారు. అయితే, ఆయన సలహాను తాను తిరస్కరించానని చెప్పారు. పాక్, పీవోకేలలోని సైనిక, ఉగ్ర శిబిరాలను లక్ష్యంగా చేసుకొని భారత సైన్యం మే 7న ఆపరేషన్ చేపట్టింది. పలు ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది.

## ఆర్ఎస్ఎస్‌కి ప్రకాష్ రాజ్ సవాల్.. కాలిందా అంటూ సెటైర్లు

ఆర్ఎస్ఎస్ మీద ప్రముఖ సినీ నటుడు ప్రకాష్ రాజ్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఈ దేశానికి ఆర్ఎస్ఎస్ ఏమి చేసిందని ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్ అంటే విషం అని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆ సంస్థ పుట్టి వందేళ్ళు అయిందని దేశ సేవలో పాత్ర ఏమిటి అని నిలదీశారు స్వాతంత్రం పూర్వం పుట్టిన ఆర్ఎస్ఎస్ నుంచి ఎవరైనా దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారా అని ఆయన ప్రశ్నించారు. ఉంటే ఒకటి రెండు పేర్లు చెప్పాలని సవాల్ చేశారు.

**లాగులు ప్యాంట్లుగా :**

విశాఖలో సీఐటీయూ ఉత్సవాలకు హాజరైన ప్రకాష్ రాజ్ ఆర్ఎస్ఎస్ ఈ వందేళ్ళలో సాధించింది ఏంటి అంటే లాగుల నుంచి ప్యాంటుల దాకా రావడమే అని ఆయన ఎద్దేవా చేశారు. ఆర్ఎస్ఎస్ దేశం మనదని అంటారు కదా దేశానికి చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. అది ఒక సంస్థ కానే కాదని అన్నారు. బ్రహ్మ రాక్షసుడు ఆర్ఎస్ఎస్ అని ఆయన అభివర్ణించారు. ఆర్ఎస్ఎస్ ని వల్లభాయ్ పటేల్ నిషేధించారు, కానీ ఆయననే తమ సొంత నాయకుడిగా చెప్పుకుంటూ బీజేపీ మూడు వేల అడుగుల విగ్రహం పెట్టిందని ప్రకాష్ రాజ్ ఎద్దేవా చేశారు. కర్ర పట్టుకుని తిరుగుతుంటారని ఆర్ఎస్ఎస్ కవాతుని కూడా ప్రకాష్ రాజ్ విమర్శించారు. ఆర్ఎస్ఎస్ లో ఒక్క మహిళా సభ్యురాలు అయినా ఉన్నారా అని ప్రశ్నించారు. ఆడవాళ్ళను గౌరవించే సంస్థగా చెప్పుకుంటారు కదా ఎక్కడ అని నిలదీశారు. కొందరికి ఎన్ని ఏళ్ళు వచ్చినా బుద్ధి రాదని



అలా ఆర్ఎస్ఎస్ కి వందేళ్ళు అయినా బుద్ధి రాలేదని ప్రకాష్ రాజ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

అర్బన్ నక్సలైట్ ఆయన : ఇదిలా ఉంటే ప్రకాశ్ రాజ్ ని అర్బన్ నక్సలైట్ అని ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు ఈ ఇద్దరి మధ్య సోషల్ మీడియా వేదికగా మాటల యుద్ధం భీకరంగా సాగింది. తనపై విష్ణువర్ధన్ రెడ్డి చేసిన సుదీర్ఘ విమర్శలకు ప్రకాశ్ రాజ్ కూడా ఘాటుగా రియాక్ట్ అయ్యారు. వెంటనే రియాక్ట్ అయ్యారు.. కాలిందా అంటూ ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ఇదిలా ఉంటే నక్సలైట్ల ఎన్‌కౌంటర్‌ను ప్రశ్నిస్తూ ప్రకాశ్ రాజ్ చేసిన విమర్శల మీద విష్ణువర్ధన్ రెడ్డి మండిపడ్డారు. సినిమా డైలాగులు చెప్పడం మాని వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు.

హెగ్డేవార్ పోరాడారు : ఆర్ఎస్ఎస్ గురించి విమర్శలు చేస్తూ చరిత్రను వక్రీకరించడం కాదని విష్ణు వర్ధన్ రెడ్డి ప్రకాష్ రాజ్ కి కౌంటర్ ఇచ్చారు. ఆర్ఎస్ఎస్ కి స్వాతంత్ర్య పోరాటంలో పాత్ర లేదంటారా 1921లో జైలుకెళ్లిన డాక్టర్ హెడ్గేవార్ చరిత్ర తెలుసుకోండని గుర్తు చేశారు. పటేల్ ఆర్ఎస్ఎస్ ని నిషేధించినా ఆధారాలు లేవని తేలాక ఆయనే బ్యాన్ తొలగించారని ఆయన చెప్పారు ఇక ఆర్ఎస్ఎస్ లో మహిళలు ఎంతో మంది ఉన్నారని రాష్ట్ర సేవికా సమితి ఏకంగా 50 ఏళ్లుగా లక్షల మంది మహిళలతో పనిచేస్తోందని ఆయన చెప్పారు ఇక ఈ దేశంలో ఆర్ఎస్ఎస్ ఏమి చేస్తోంది అని అంటున్నారని దేశంలో విపత్తుల సమయంలో ఎవరు సేవ చేస్తున్నారో ప్రకాష్ రాజ్ తెలుసుకోవాలని అన్నాఉర్. లక్షలాది కార్యకర్తలు, తమ ప్రాణాలు తెగించి మానవత్వంతో సేవ చేస్తుందని చెప్పారు.

అపుడు ఎందుకు ఖండించలేదు : మావోయిస్టులు గురించి ఉపన్యాసాలు దంచుతున్న ప్రకాష్ రాజ్ 2000 నుండి 2025 వరకు మావోయిస్టుల దాడుల్లో సుమారు 2,722 మంది పోలీసులు చనిపోయారు మరి అప్పుడు ఎందుకు ఖండించలేదని విష్ణు వర్ధన్ రెడ్డి ప్రశ్నించారు. నేడు జనజీవనంలోకి వచ్చిన మావోయిస్టు నేతలే అడవిలో ఉన్న తోటివారి తుపాకులు హింసను ఆపమంటున్నారని ఆయన చెప్పారు. ప్రకాష్ రాజ్ లాంటి వారు వారిని రెచ్చగొడుతున్నారని కానీ ఆయన మాత్రం తుపాకీ పట్టుకుని అడవిలోకి వెళ్లడం ఎందుకు వెళ్ళడంలేదని ప్రశ్నించారు. ఇక ప్రకాశ్ రాజ్ నక్సలైట్లను ఎన్‌కౌంటర్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. వాళ్లు కూడా మన ప్రజలే కదా అని అంటూ వారితో మాట్లాడి జనజీవన స్రవంతిలో కలపాలి కానీ హత్యలు చేయడమేంటి అని మండిపడ్డారు.

## వైసీపీకి నీలి నీడలు అంటే ఇవే మరి..!

నిజానికి రాజకీయ పార్టీ అంటే దూకుడు ఉండాల్సిందే. కానీ అది హద్దులు దాటుతోంది. కూటమి పార్టీలు విమర్శించాయని కాదు కానీ చెక్ చేసుకోవాల్సిన అవసరం ఉంది కదా అన్నది కూడా విశ్లేషణగా ఉంది.

వైసీపీని ఒక రాజకీయ పార్టీగా గుర్తించను అని ఈ మధ్యనే ఉప ముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. అది చాలా తీవ్రమైన విమర్శగానే చూడాలి. ఎందుకు ఆయన అలా అన్నారు అంటే రాజకీయ ప్రత్యర్థి కాబట్టి విమర్శించారు అని లైట్ తీసుకుంటే పొరపాటే. వైసీపీ ఒక రాజకీయ పార్టీగా ఉంటూనే అందులో దూకుడు చేసే వారు శృతి మించే వారు ఎక్కువ అన్నది ఆయన భావనగా ఉంది. రాజకీయ పార్టీ అంటే యాక్షన్ ఉంటుంది. ఓవర్ యాక్షన్ చేసేవారు ఎక్కువగా ఉండడం సోషల్ మీడియాలో అతి ఉత్సాహంగా చేసే పోస్టులు ఆందోళనలు నిర్వహించినా వారు మితిమీరిన పోకడలు ఇవన్నీ కూడా ఉన్నాయని చెబుతారు. నిజానికి రాజకీయ పార్టీ అంటే దూకుడు ఉండాల్సిందే. కానీ అది హద్దులు దాటుతోంది. కూటమి పార్టీలు విమర్శించాయని కాదు కానీ చెక్ చేసుకోవాల్సిన అవసరం ఉంది కదా అన్నది కూడా విశ్లేషణగా ఉంది.



**రప్పా రప్పా నినాదాలు :**

వైసీపీ మీద నేరస్థులకు కొమ్ము కాస్తూ ఆ ముసుగులో రాజకీయాలు చేసే పార్టీ అని ఇప్పటికే కూటమి పార్టీల నేతలు విమర్శిస్తూంటారు. రప్పా రప్పా అని నినాదాలు ఇవ్వడం మీద కూడా ఆ మధ్య పెద్ద చర్చనే సాగింది. అది సినిమా డైలాగ్ అని తేలికగా తీసుకుని వదిలేస్తే ఇపుడు జంతు బలులు కూడా చేస్తూ రప్పా రప్పా అంటున్నారని కూటమి నేతల నుంచి విమర్శలు వస్తున్నాయి. అధినేత జగన్ పుట్టిన రోజున కొంత మంది అతి ఉత్సాహవంతులైన కార్యకర్తలు పొట్టేళ్ళను తెగ నరికి సంబరాలు చేయడం మీద అయితే పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. కూటమి ప్రభుత్వం అయితే దీనిని సీరియస్ గానే తీసుకుంటోంది. రప్పా రప్పా అంటే అసలు ఉపేక్షించేది లేదని హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. రౌడీ రాజకీయాలను సహించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా హెచ్చరించారు.

తటస్తులలో సైతం : ఏ రాజకీయ పార్టీ అయినా జనం నుంచే మెప్పు పొందలై తటస్థులు విద్యావంతులు ప్రతీ విషయాన్ని గమనిస్తూ ఉంటారు. అలాంటిది రప్పా రప్పా నినాదాలు చేస్తూ వైసీపీ ఏ విధంగా రాజకీయాలను ముందుకు తీసుకుని పోగలదని కూడా ప్రశ్నలు వస్తున్నాయి. అన్ని వర్గాల మద్దతు ఏ పార్టీకైనా అవసరం. ప్రజా సమస్యల మీద గట్టిగా మాట్లాడితే జనం మద్దతు దక్కుతుంది, కానీ వేరే విధంగా ఆవేశం చూపిస్తే మాత్రం అదే జనం నుంచి వేరేగా రియాక్షన్ వస్తుంది. ఈ విషయంలో వైసీపీ అధినాయకత్వం కూడా క్యాడర్ ఉత్సహాన్ని కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు. రప్పా రప్పా అన్నదే కొంప ముంచేలా ఉందని కూడా చర్చ సాగుతోంది.

అంతిమంగా నష్టమే : వైసీపీ పేరుతో అనుచిత పోస్టింగులు సోషల్ మీడియాలో పెట్టినా లేక రోడ్ల మీదకు వచ్చి రప్పా రప్పా తరహా కార్యక్రమాలు చేపట్టినా కూడా అది అంతిమంగా వైసీపీకే చేటు తెస్తుందని అంటున్నారు. అధినాయకత్వం ఏమి చేస్తోంది అని కూడా కూటమి నేతలు ప్రశ్నిస్తున్నారు అంటే ఆలోచించాల్సిన అవసరం ఉందని అంటున్నారు. ఇక చూస్తే జగన్ పుట్టిన రోజున ఏపీలో కళ్యాణదుర్గం, ఉరవకొండ, సింగనమల, రాప్తాడు, కుప్పం వంటి పదికి పైగా నియోజకవర్గాలలో ఒకే తరహాలో జంతు బలులు, రక్తాభిషేకాలు జరిగాయని హోం మంత్రి చెప్పుకొచ్చారు ఇదంతా వ్యవస్థీకృత నేరమేనని స్పష్టమవుతోందని ఆమె ఆరోపించారు. వైసీపీ కార్యకర్తలు మేకల తలలు నరికి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడమేంటని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీకి ఎందిన శ్రేణులు ఎలాంటి తప్పులు చేసినా ఆ పార్టీ నాయకుడు జగన్ నోరు తెరిచి వాటిని ఎందుకు ఖండించడం లేదని అనిత తీవ్రంగా తప్పుబట్టారు. దీనిని బట్టి చూస్తే వైసీపీ ఈ అతి పోకడలకు ఎక్కడో ఫుల్ స్టాప్ పెట్టించాల్సిన అవసరం అయితే ఉందని అంటున్నారు.

### 2025 డైరీ

## చంద్రబాబులో కొత్త షేడ్స్!



ఈ ఏడాది ఏపీలో చోటు చేసుకున్న కీలక పరిణామాల్లో సీఎం చంద్రబాబు గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ముఖ్యమంత్రిగా ఆయన చూపిన దూకుడు.. ప్రజలకు చేరువ అయిన విధానం నభూతో.. అనే చెప్పాల్సి ఉంటుంది. సహజంగా ముఖ్యమంత్రి అంటేనే బిజీగా ఉంటారు. ఇక, విజన్ సాకారం చేసుకునే దిశగా అడుగులు వేసే చంద్రబాబు అయితే.. మరింత బిజీగా ఉంటారు. కానీ.. తాను ఎంత బిజీగా ఉన్నప్పటికీ.. చంద్రబాబు ప్రతినెలా రెండు సార్లు.. ప్రజల మధ్యకు వెళ్తున్నారు. ఆప్యాయంగా పలకరిస్తున్నారు. కష్టసుఖాలు తెలుసుకుంటున్నారు. వారితో మమేకం అవుతున్నారు. తద్వారా.. ప్రజల ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకుంటున్నారు.

2) మోడీపై ప్రశంసలు: కేంద్రంలోని బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ.. ఇప్పుడు అదే పార్టీకి వెన్నుదన్నుగాఉన్న విషయం తెలిసిందే. కేంద్రంలో మోడీ సర్కారు నిలబడేందుకు టీడీపీనే ప్రధాన ఆక్సిజన్ అందిస్తోంది. అయినప్పటికీ.. చంద్రబాబు మాత్రం ప్రధాని నరేంద్ర మోడీవిషయంలో నాలుగు అడుగులు ముందు వేస్తున్నారు. ఆయనతో సంబంధాన్ని మరింత గాఢంగా పెంచుకునేందుకు ప్రయత్నించారు. ఈ సంవత్సరంలో మొత్తంనాలుగు సార్లు ప్రధానిని ఏపీకి ఆహ్వానించారు. నిజానికి 2014-18 మధ్య కూడా.. టీడీపీ-బీజేపీల మధ్య పొత్తు ఉన్నా.. దానికి భిన్నంగా ఇప్పుడు చంద్రబాబు కొత్త రూట్‌ను ఎంచుకున్నారు.

3) పాలన పరంగా..: పాలన పరంగా చంద్రబాబు చాలా సరికొత్త పుంతలు తొక్కుతున్నారనే చెప్పాలి. అటు ప్రభుత్వ పరంగా కీలక నిర్ణయాలు తీసుకుంటూ.. వాటి అమలుపై దృష్టిపెడుతున్నారు. ప్రతిమూడు నెలలకు ఒకసారి.. కలెక్టర్ల సదస్సుతోపా టు.. ప్రతి 15 రోజులకు ఒకసారి మంత్రి వర్గ సమావేశాలు నిర్వహిస్తున్నారు. తద్వారా ప్రజలకు-ప్రభుత్వానికి మధ్య వారధి వంటి ఈ రెండు వ్యవస్థలను సమన్వయం చేస్తున్నారు. ఇక, వాట్సాప్ పాలన, ఆర్టీజీఎస్ వంటి వ్యవస్థలతో ప్రభుత్వ సంక్షేమ పథకా లను ప్రజలకు చిటికెలో చేరవేస్తున్నారు. సూపర్ సిక్స్ వంటి ఎన్నికల హామీలతోపాటు.. చెప్పనివి కూడా అమలు చేస్తున్నారు. ముఖ్యంగా ఆటోవాలాలు, పాస్టర్లు, మహిళలకు ఈ పథకాలు అందేలా చేస్తున్నారు. 2047 విజన్ తో ముందుకు సాగుతూ.. కేంద్ర-రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని పెంచుతున్నారు.

4) పార్టీ పరంగా.. : ఈ విషయంలోనూ చంద్రబాబు గతానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. గతంలో పార్టీ అధికారంలో ఉన్న ప్పుడు.. నాయకులను పట్టించుకునే వారుకాదు. దీంతో పార్టీ దెబ్బతింది. ఈ నేపథ్యంలో తాజాగా పార్టీకి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతి శనివారం పార్టీ కేంద్రకార్యాలయానికి వెళ్లి నాయకుల పరిస్థితిని వాకబు చేస్తున్నారు. తప్పులు సరిచేసే ప్రయత్నం చేస్తున్నారు. నాయకులను గాడిలో పెడుతున్నారు. ప్రభుత్వానికి-పార్టీకి మధ్య వారధులు నిర్మిస్తున్నారు. ఇదేసమయంలో పదవుల నియామకంలోనూ నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇలా.. పార్టీ విషయంలోనూ ఈ ఏడాది చంద్రబాబు చాలానే చర్యలు తీసుకున్నారు. మొత్తంగా.. చంద్రబాబుకు 2025 సూపర్ సక్సెస్ తీసుకువచ్చిందనే చెప్పాలి.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

సోమవారం, 29 డిసెంబర్ 2025




www.viswamvoice.com

గ్రామ స్థాయి నుండి తెలుగు రాష్ట్రాలకు విస్తరించిన

# వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు

## తొమ్మిది నుంచి 17 మందికి పెంపు - నేడు ఘనంగా ప్రమాణ స్వీకారం



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా దినదినాభివృద్ధి చెందుతున్న వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ ప్రమాణస్వీకారం సోమవారం అంగరంగ వైభవంగా జరగనుంది. ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి.శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయానికి ఇదే అతిపెద్ద ట్రస్ట్ బోర్డ్. ఎందుకంటే ఈ ఆలయ కమిటీ కొన్ని ఏళ్ల క్రితం వరకు కూడా వాడపల్లి గ్రామస్థాయిలోనే ఉండేది. ఆ తర్వాత రోజుల్లో ఆత్రేయపురం మండలానికి విస్తరించింది. నిన్న మొన్నటి వరకూ కొత్తపేట నియోజకవర్గానికి విస్తరించింది.ఆ తర్వాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు విస్తరిస్తుందని అందరూ భావించారు. కాని ఇప్పుడు ఏకంగా తెలుగు రాష్ట్రాలకే వ్యాప్తి చెందింది.అలాగే తొమ్మిది మందితో ఉండే ఈ దర్మకర్తల మండలి 17 మందితో పాటు ఇద్దరు ఎక్స్ అఫిషియల్ మెంబర్లను నియమించారు. అందుకనే ఈ ట్రస్ట్ బోర్డు నియామకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కీలకంగా భావించింది. ప్రభుత్వం వచ్చి ఇన్ని నెలలు గడుస్తున్నా నియమాకానికి ఇంత జాప్యం జరగడానికి కూడా ఇదే కారణం.

**చైర్మన్ పదవికి రాష్ట్ర స్థాయిలో పోటీ**

ట్రస్ట్ బోర్డు చైర్మన్ పదవికి రాష్ట్ర స్థాయిలో అనేక మంది పోటీ పడ్డారు.తిరుమల తిరుపతి దేవస్థానం తర్వాత వెంకటేశ్వర స్వామి భక్తులు వాడపల్లి దేవాలయానికే అధికంగా తరలివస్తున్నారు.అందుకనే అనతి కాలంలోనే ఈ ఆలయానికి ఎనలేని గుర్తింపు వచ్చింది.ఏడు వారాల వాడపల్లి వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నినాదం భక్తుల్లో బలమైన విశ్వాసాన్ని పొందింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశవ్యాప్తంగా అనేకమంది ఈ స్వామివారి దర్శనానికి వస్తున్నారు. దీంతో ఈ చైర్మన్ పదవి పొంది సేవ చేసుకోవడానికి అనేకమంది ప్రముఖులు ఈసారి పోటీపడ్డారు.రాష్ట్రంలో పలువురు కూటమి నాయకులు ఈ చైర్మన్ పదవి కోసం పట్టుపట్టారు. అయితే ఆత్రేయపురంకు చెందిన ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్) తెలుగుదేశం పార్టీకి కష్ట సమయంలో అండగా నిలిచారు. ఆర్థికంగానూ కూడా పార్టీకి తన వంతు సేవలు అందించారు. గత ప్రభుత్వంలో అనేక కేసులు కూడా పెట్టించుకున్నారు.ఆ సమయంలోనే పార్టీ అధికారంలోకి వస్తే చైర్మన్ పదవి ఇవ్వడానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కష్టపడి ఒప్పించి చైర్మన్ పదవిని ఆయనకి ఎమ్మెల్యే బండారు ఇప్పించగలిగారు. కానీ భవిష్యత్తులో చైర్మన్ పదవి స్థానిక నేతలెవరికీ దక్కదనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తుంది. ఎందుకంటే ఈ స్వామి వారి ఆలయం ఆ స్థాయి గుర్తింపు సాధిస్తుంది.

**ట్రస్ట్ బోర్డు నియమాకాల్లోనూ పోటాపోటీ**

ఈ దేవస్థానం కమిటీ చైర్మన్ పదవికే కాదు సభ్యులకు కూడా విపరీతమైన పోటీ నెలకొంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది ఎమ్మెల్యేలు,ఎంపీలు స్వామి వారి దర్శనాలకు సిఫార్సు లేఖలు ఇస్తున్నారు. దీంతో ఈ దేవస్థానం కమిటీలో మాకు స్థానం కావాలని అనేకమంది మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎంపీలు పట్టు పట్టారు. అనకాపల్లి ప్రాంతాల నుంచి వచ్చేవారు అధికంగా ఉన్నందున తమకు అవకాశం ఇవ్వాలని అక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పట్టపట్టడంతో ఆ నియోజకవర్గం నుండి ఒకరికి అవకాశం ఇచ్చారు. అలాగే ఒంగోలు, కృష్ణా జిల్లా పామర్రు, పశ్చిమగోదావరి ఆచంట, పాలకొల్లు, కాకినాడ జిల్లా పెద్దాపురం లతో పాటు తెలంగాణ ప్రాంతానికి చెందిన ఒకరికి ఈ ధర్మకర్తల మండలిలో స్థానం కల్పించ్చారు.ప్రభుత్వ నిబంధనలతో కులాల వారిగా రిజర్వేషన్ల ప్రకారం ఈ నియామకం చేసారు.అలాగే మొత్తం 17 మంది సభ్యుల కమిటీలో చైర్మన్ తో పాటు 14 మంది టీడీపీ కాగా జనసేనకు రెండు, బిజెపి ఒకరికి అవకాశం ఇచ్చారు. అలాగే దేవస్థాన అర్చక విభాగం నుంచి ప్రత్యేక ఆహ్వానతులుగా వాడపల్లి సుందర శేషావతారం ను నియమించారు. మరొక ప్రత్యేక ఆహ్వానతులుగా మత్స్యకార సామాజిక వర్గం నుంచి వానపల్లికి చెందిన మసకపల్లి త్రిమూర్తులను నియమించారు. వీరిద్దరూ ఆ 17 మంది ధర్మకర్త మండల తో పాటు ఎక్స్ అఫీషియల్ మెంబర్స్‌గా కొనసాగుతారు. ప్రమాణ స్వీకారం చేసే పాలక వర్గం 1. ముదునూరి వెంకటరాజు(గబ్బర్ సింగ్ రాజు)చైర్మన్‌గా, సభ్యులుగా 2.చలుమూరి రాంబాబు(ఆచంట), 3.గంగవరపు పద్మావతి(ఒంగోలు), 4.కాసా చాముండేశ్వరి (కేతరాజుపల్లి), 5.కొల్లుబోయిన శ్రీనివాసరావు(పెద్దాపురం) 6.పెండెం కుమారి(ర్యాలి) , 7.పెండ్యాల భవాని(పాలకొల్లు), 8.సలాది నాగేశ్వరరావు(పెదపళ్ల), 9.సరళ సరిత(మోడేకుర్రు), 10.ఏపుగంటి విజయ కుమారి(వాడపల్లి), 11.చింతపల్లి సత్యనారాయణ(మోడుకుర్రు), 12.తమ్మన సాయి ప్రసాద్(కొత్తపేట), 13.ఎల్లమల్లి చంద్రకుమారి(కొత్తపేట), 14.కొండపల్లి రామచంద్రరావు(తెలంగాణ), 15.సిస్తా సూర్య కుటుంబరావు(ఆత్రేయపురం), 16.దళపర్తి శ్రీ లక్ష్మి(కృష్ణా జిల్లా పామర్రు), 17.గోసాల అప్పలనరస(పాయకరావుపేట). ఈ సందర్భంగా ఆలయి డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు మాట్లాడుతూ నూతన పాలకమండలి ప్రమాణస్వీకారంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

# రూ.65 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక 9వ డివిజన్ ఏవీ అప్పారావు రోడ్డులో రూ. 65 లక్షలతో అభివృద్ధి పనులకు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శ్రీకారం చుట్టారు. సదరు రోడ్డులోని షాలోమ్ చర్చ్ దగ్గర నుంచి ఆ పరిసరాల్లోని డ్రైనేజీలపై స్లాబ్ లు వేసేందుకు తదితర అభివృద్ధి పనుల నిమిత్తం పనులు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ 9వ డివిజన్లోనే సుమారు రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పార్కులను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. 9వ డివిజన్లోనే ఇంకా అనేక అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందన్నారు. గత వైకాపా పాలకులు ఈ ప్రాంతాన్ని విస్మరించారని, ఒక్క రోడ్డు కానీ... డ్రైనేజి కానీ అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని మండిపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నగరంలో సుమారు రూ. 290 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వైకాపా ఐదేళ్ల పాలనలో ప్రజా అవసర పనులు కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. గత పాలకులు ప్రజలకు అవసరమైన పనులు మానేసి ఆడంబరాలకు వెళ్లి ప్రజాధనం దుర్వినియోగం చేసి అనాలోచిత పనులు చేపట్టారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఏంకావాలో పనులే చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన బొడ్డు



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జి రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఇటీవల తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన విషయం పాఠకులకు విధితమే. ఆదివారం బొడ్డు వెంకటరమణ చౌదరి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావును రాజమహేంద్రవరం తన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలియచేసి సాల్వాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆదిరెడ్డి, బొడ్డుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సత్కరించారు. అనంతరం పార్టీని మరింత బలోపేతం చేయడానికి కొద్దిసేపు ముచ్చటించారు.

# సమాజ అభివృద్ధి, రాష్ట్ర ప్రగతిలో భాగమైన క్రెడాయ్




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పిడింగొయ్యిలోని క్రెడాయ్ కార్యాలయంలో జరిగిన క్రెడాయ్ వారి సమావేశానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రెడాయ్ ప్రతినిధులు పలు అంశాలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ దృష్టికి తీసుకువచ్చారు.వాటిపై ఆయన సానుకూలంగా స్పందించారు. సమాజ అభివృద్ధి, రాష్ట్ర ప్రగతిలో భాగమైన క్రెడాయ్‌కు తాము, తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. వ్యాపార సంస్థల యొక్క అభివృద్ధికి ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. ప్రభుత్వ సహకారం ఏ విధంగా కావాలంటే ఆ దిశగా ఆలోచలు చేస్తుందన్నారు. మీ వ్యాపారాలు బాగుంటే అదే ప్రభుత్వానికి రాబడి అని, రాష్ట్రం ప్రగతి మార్గంలో పయనించడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ క్రెడాయ్ వారితో అన్నారు. క్రెడాయ్ వారు విన్నవించిన ప్రతి సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో క్రెడాయ్ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# టిడ్కో లబ్ధిదారుల ఇళ్లను సీజ్ చేయడం అన్యాయం

## తక్షణమే రుణమాఫీ హామీని నెరవేర్చాలి - బోడసకుర్రు దేవరలంకలో సీపీఎం ఆధ్వర్యంలో లబ్ధిదారుల నిరసన



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పట్టణ పేదల సొంతింటి కలను సాకారం చేస్తామన్న ప్రభుత్వాల హామీలు క్షేత్రస్థాయిలో నీటి మూటలుగా మిగిలిపోతున్నాయని సీపీఎం పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు - దేవరలంక సమీపంలోని టిడ్కో గృహ సముదాయం వద్ద ఆదివారం లబ్ధిదారులతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, కేవీపీస్ జిల్లా కన్వీనర్ శెట్టిబలిత్తుల తులసీరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టిడ్కో లబ్ధిదారులకు ఇచ్చిన 'రుణమాఫీ' హామీని తక్షణమే అమలు చేయాలనీ, పెండింగ్‌లో ఉన్న బ్యాంక్ రుణాలను ప్రభుత్వమే భరించి లబ్ధిదారులపై భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. మౌలిక వసతులు లేక ఇళ్లలోకి వెళ్లలేని పరిస్థితిలో ఉన్న లబ్ధిదారులను బ్యాంక్ అధికారులు ఈఎంఐల కోసం వేధించడం సరికాదు అని అన్నారు. వేధింపులకు పాల్పడుతున్న బ్యాంకులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీజ్ చేసిన ఫ్లాట్లను తిరిగి ఇవ్వాలి అని కోరారు. వాయిదాలు చెల్లించలేదనే సాకుతో అధికారులు సీజ్ చేసిన ఫ్లాట్లను తక్షణమే అన్‌సీజ్ చేసి, అసలైన లబ్ధిదారులకు తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు.తాగునీరు, డ్రైనేజీ, స్కూల్ బిల్డింగ్, స్మశాన వాటిక, హైవేకు దగ్గరగా రోడ్డు లేక బోడసకుర్రు టిడ్కో ఇళ్లు భూత్ బంగ్లాల్లా మారుతున్నాయి. యుద్ధ ప్రాతిపదికన ఇక్కడ అన్ని సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులు నివసించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.లబ్ధిదారుల సమస్యలను గాలికి వదిలేసి, వారిని అప్పుల ఊబిలోకి నెట్టడం దారుణమని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి సానుకూల నిర?యం తీసుకోకపోతే, లబ్ధిదారులందరినీ ఏకం చేసి కలెక్టరేట్ ముట్టడికి సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీస్ నాయకులు చింతా వీరప్రసాద్, టిడ్కో గృహాల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పాడ నూకరత్నం చింతలపూడి దేవి, మహారాజు వెంకటలక్ష్మి, ఈ విజయలక్ష్మి, మాచర్ల వెంకటలక్ష్మి డి.శేషారత్నం, మరియు టిడ్కో గృహ లబ్ధిదారులు మహిళలు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన జక్కంపూడి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం మండలంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆదివారం రాజానగరం మండలంలోని శ్రీకృష్ణపట్నంలో ఇటీవల మృతి చెందిన మోటుపల్లి గంగారత్నం కుటుంబసభ్యులను, కొత్తపల్లి సూర్యాకాంతం కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. పుణ్యక్షేత్రంలో ఇటీవల మృతి చెందిన తెల్లమేకల సూర్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ త్వరగా కోలుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, మృతుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# వైద్యరంగానికి 'శివరామకృష్ణారావు' ఎనలేని సేవలు

## నూరేళ్ళ పుట్టినరోజు వేడుకల్లో వైద్య ప్రముఖులు, శిష్యబృందం - కుటుంబసభ్యుల మధ్య ఘనంగా వేడుకలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైద్యరంగానికి ప్రొఫెసర్ డాక్టర్ పట్నం శివరామ కృష్ణారావు చేసిన సేవలు ఎనలేనివని తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు వైద్య ప్రముఖులు, డాక్టర్ రావు శిష్యులు పేర్కొన్నారు. వైద్య కళాశాల ప్రొఫెసర్‌గా ఎంతో మందిని వైద్యులుగా తీర్చిదిద్ది, వైద్యునిగా ఎందరికో వైద్య సేవలు అందించిన డాక్టర్ పట్నం శివరామకృష్ణా రావు శత వసంతాలు పూర్తిచేసుకుని ఆదివారం స్థానిక షల్టన్ హోటల్‌లో శిష్య బృందం, కుటుంబసభ్యుల మధ్య పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శివరామ కృష్ణారావు వద్ద వైద్య విద్యను అభ్యసించి, ఉభయ తెలుగు రాష్ట్రాలలో స్థిరపడిన అనేక మంది ప్రముఖ డాక్టర్‌లు ఈ వేడుకకు హాజరై శివరామకృష్ణారావుకు పాదాభివందనం చేసి ఆయన ఆశీస్సులను అందుకున్నారు. డాక్టర్ శివరామకృష్ణారావు సింహపురిగా పేరుగాంచిన నెల్లూరు జల్లాలో జన్మించారు. మద్రాస్‌లో బిఎస్సీ, ఎంబిబిఎస్ పూర్తిచేసిన ఆయన, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎండి పూర్తిచేశారు. అమెరికా, లండన్ వంటి దేశాలలో కూడా వైద్య విద్యను అభ్యసించారు. ఆంధ్రామెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా, హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్‌గా సేవలు అందించారు. ఫిజీషియన్‌గా కింగ్ జార్జి హాస్పటల్, విశాఖపట్నంలో పనిచేశారు. 28 సంవత్సరాల పాటు వైద్య విద్య బోధన, పరిశోధన రంగాలలో పనిచేశారు. ఆయన వద్ద విద్యను అభ్యశించిన ఎంతో మంది డాక్టర్‌లు దేశ, విదేశాలలో ప్రముఖ వైద్యులుగా రాణిస్తున్నారు. ఆంధ్ర మెడికల్ కళాశాలలో మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ కమిటీ ఛైర్మన్‌గా, కెజిహెచ్‌లో డ్రగ్ కమిటీ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు. డాక్టర్ రావు జాతీయ, అంతర్జాతీయ వేదికలలో అనేక శాస్త్రీయ సెషన్స్‌లో పాల్గొని సమర్పించిన 27 పత్రాలు ప్రచురితమయ్యాయి. ఆయన చేసిన ఉపన్యాసాలకు రెండు బంగారు పతకాలను అందుకున్నారు. వైద్య రంగంలో చేసిన సేవలకు గాను అనేక పురస్కారాలను అందుకున్నారు. ఐఎంఎలో వివిధ హోదాల్లో పనిచేసి సంస్థకు సేవలు అందించారు. లయన్స్ క్లబ్ వంటి సంస్థల్లో సేవలు అదించారు. డాక్టర్ రావు కుటుంబసభ్యులు అమెరికా వంటి దేశాలలో స్థిరపడగా, ఆయన మాత్రం మాతృదేశం పట్ల మమకారంతో భారతదేశంలోనే ఉండిపోయారు. ఆయన మనుమరాలు(కుమార్తె కూతురు), నగర ప్రముఖులు రౌతు రవీంద్ర సతీమణి కుటుంబంతో కలసి పవిత్ర గోదావరి తీరాన్న రాజమహేంద్రవరం నగరంలో జీవనం సాగిస్తున్నారు. శతవత్సరాలు పూర్తిచేసుకున్నా డాక్టర్ రావు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యం ఉన్నారు. వందేళ్ళ పండుగకు హాజరై తమ గురువుగారిని సత్కరించడానికి విచ్చేసిన శిష్యులను పేరుపేరునా పలకరించి ఆశ్చర్య పరిచారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సోమరాజుతో పాటు, వైద్య ప్రముఖులు డాక్టర్ ఐవి రావు, బాబ్జి, ఎస్‌కె అప్పారావు, డాక్టర్ పెద వీర్రాజు తదితరులు ఈ వేడుకలో పాల్గొని మాట్లాడుతూ డాక్టర్ శివరామకృష్ణారావు శిష్యరికంలో తాము మంచి వైద్య నిపుణులుగా తీర్చిదిద్దబడ్డామన్నారు. ఆయన వైద్య రంగానికి చేసిన సేవలను కొనియాడారు. నగరానికి చెందిన వైద్యులు డాక్టర్ నేమాని, డాక్టర్ గోలు రామారావు, డాక్టర్ వేదమణి, డాక్టర్ రామచంద్ర, చీఫ్ ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ పివి రామారావు, రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షులు శోభనాద్రీశ్వరరావు, మాజీ శాసనసభ్యులు రౌతు సూర్యప్రకాశరావు, రౌతు వరుణ్, అడపా శ్రీహరి, మేడిశెట్టి తిరుమలకుమార్, మేడిశెట్టి తాతారావు, శ్రీకన్య సూర్యనారాయణరాజు, పులవర్తి లక్ష్మణస్వామి, యజ్జరపు మరిడయ్య, లోలుగు గిరిధర్, యియ్యపు మాధవ్, యియ్యపు మురళీధర్‌రావు, ఆంధ్ర మెడికల్ కళాశాల విశాఖపట్నం, గుంటూరు మెడికల్ కళాశాల, కాకినాడ మెడికల్ కళాశాలల నుండి డాక్టర్ రావు శిష్యులు పెద్దఎత్తున తరలివచ్చి ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రావు మాట్లాడుతూ తన జీవన ప్రయానం గురించి వివరించారు. పెద్దఎత్తున శిష్యులు తన వందేళ్ళ పుట్టినరోజు వేడుకలకు హాజరు కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

# ఎస్‌పి ఆదేశాల మేరకు రౌడీ షీటర్స్‌కి కౌన్సిలింగ్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లను స్టేషన్లకు పిలిపించి వారికి ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిరోధించడం.రౌడీ షీటర్లు పాత నేర చరిత్రను విడిచిపెట్టి, మంచి జీవనం గడిపేలా వారికి మార్గనిర్దేశం చేయడం. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే, కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంగా హెచ్చరించడం. నేరాలకు దూరంగా ఉంటూ గౌరవప్రదమైన జీవనోపాధిని ఎంచుకోవాలని వారికి సూచించడం జరిగింది. ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ మాట్లాడుతూ, "జిల్లాలో ఎలాంటి అసాంఘీక శక్తులు, రౌడీయిజం, గూండాయిజంలకు తావు లేకుండా చూస్తాము. నేరాలకు పాల్పడే వారిపై, పాత నేరాలను పునరావృతం చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోము. ఈ కౌన్సిలింగ్ ద్వారా వారు తమ ప్రవర్తనను మార్చుకుంటారని ఆశిస్తున్నాము," అని తెలిపారు.

# ఎడిటర్ వాయిస్

## మూడు కాదు రెండే...
## జిల్లాల పునర్విభజనలో పీఠముడి వీడినట్లేనా..!

అవును... జిల్లాల పునర్విభజనపై జరిగిన సమావేశంలో అధికారులు సీఎం చంద్రబాబు వద్ద ఓ కీలక విషయాన్ని ప్రస్తావించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 26 జిల్లాలు ఉన్న సంగతి తెలిసిందే. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించారు! అయినప్పటికీ.. కొన్ని జిల్లా కేంద్రాలకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. కొత్త జిల్లాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది! ఈ క్రమంలోనే మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో.. చివరకు రెండు జిల్లాలను కొత్తగా ఏర్పాటు చేయనున్నారని తెలుస్తోంది. అవును... జిల్లాల పునర్విభజనపై జరిగిన సమావేశంలో అధికారులు సీఎం చంద్రబాబు వద్ద ఓ కీలక విషయాన్ని ప్రస్తావించారు. ఇందులో భాగంగా... చిన్న జిల్లాల కారణంగా తెలంగాణలో ఎదురవుతున్న ఇబ్బందులపై చర్చించారు. ఈ నేపథ్యంలోనే.. రాజంపేట నియోజకవర్గాన్ని వైఎస్సార్ కడపలో, రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో, కొత్తగా ఏర్పాటు చేసే మదనపల్లె జిల్లాలో రాయచోటిని కలిపేందుకు ఉన్న అవకాశాల్ని పరిశీలించాలని అధికారులు ప్రతిపాదించారు. వాస్తవానికి తొలుత.. మదనపల్లె, పోలవరం, మార్కాపురం ప్రాంతాలను కొత్త జిల్లాలుగా ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందని చెబుతున్నారు. అయితే తాజాగా వీటిలో రెండు మాత్రమే ఎంపికయ్యాయని తెలుస్తోంది. ఇందులో భాగంగా... మదనపల్లె, మార్కాపురం జిల్లాలను మాత్రమే కొత్తగా ఏర్పాటు చేయనున్నారని సమాచారం. కాగా... జిల్లాలు, రెవెన్యూ డివిజన్లలో మార్పుచేర్పులకు సంబంధించి ప్రభుత్వం గత నెల 27న ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. నెల రోజులపాటు అభ్యంతరాలు స్వీకరించింది. ఈ సందర్భంగా... రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన 927 అభ్యంతరాలపై ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు శనివారం చర్చించారు. వీటన్నింటిపై ఆదివారం మరోసారి సమగ్రంగా చర్చించి, తుది నిర్ణయం తీసుకోనున్నారు. 31న తుది నోటిఫికేషన్ జారీ చేస్తారు.

**రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగించాలి!**

కొత్తగా ఏర్పాటు చేయబోతున్నట్లు తెలుస్తోన్న మదనపల్లిలో రాయచోటిని కలిపేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నారని అంటున్న నేపథ్యంలో ఓ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇందులో భాగంగా... అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని కొనసాగించాలని కోరుతూ రాయచోటిలో ఆదివారం ఉదయం జేఏసీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళనలు కొనసాగించారు. ఈ సందర్భంగా... 'మదనపల్లె వద్దు - రాయచోటి ముద్దు' అంటూ నినాదాలతో హోరెత్తించారు.

**జనగణన పూర్తవ్వగానే డీలిమిటేషన్!**

ఈ సందర్భంగా గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి ప్రక్రియపైనా కీలక అప్ డేట్ తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా... జనగణన పూర్తయ్యేవరకూ డీలిమిటేషన్ చేపట్టకూడదని కేంద్రం ఆదేశించిందని, సర్వే పూర్తవ్వగానే గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి ప్రక్రియ చేపడతామని పట్టణాభి వృద్ధిశాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఇప్పటికే కేంద్రం జనాభా సర్వే ప్రారంభించినందు వల్ల ఈ ప్రక్రియ ఇప్పుడు చేపట్టేందుకు అడ్డంకిగా మారిందని తెలిపారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# పీఎంపీల సేవలు శ్లాఘనీయం : ఎమ్మెల్సీ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు టీడీ జనార్ధన్

**ఏలూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు అత్యవసర సమయంలో పీఎంపీలు అందిస్తున్న సేవలు శ్లాఘనీయమని మాజీ ఎమ్మెల్సీ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు టీడీ జనార్దన్ అన్నారు. శనివారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) అరవై మూడవ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రం హాస్పిటల్స్ కాన్ఫరెన్స్ హాల్ నందు జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంను ఆశ్రం హాస్పిటల్స్ డైరక్టర్ రతీదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన టీడీ జనార్దన్ మాట్లాడుతూ గ్రామాల్లో పేదలకు ప్రాథమిక వైద్యం అందిస్తున్న పీఎంపీలు ధన్యులని,వారి లేని గ్రామాలను ఊహించలేమని, వారికి నిలిచిన కమ్యూనిటీ పారా మెడిక్స్ శిక్షణ గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుని వెళ్ళడం జరిగిందని త్వరలోనే అందరికీ మంచి జరుగుతుందని తెలిపారు. ఆశ్రం హాస్పిటల్ డైరెక్టర్ రతీదేవి మాట్లాడుతూ పల్లెల్లో ప్రజల ఆరోగ్య సంరక్షణ లో కీలకపాత్ర వహిస్తున్న పీఎంపీల సేవలు అభినందనీయమని అన్నారు,ప్రజలకు దగ్గరగా ఉండి ప్రాథమిక వైద్య సేవలందించేది పీఎంపీలేనని పీఎంపీలకు ఆరోగ్యపరంగా ఎప్పుడు ఏ అవసరం వచ్చిన ఆశ్రం హాస్పిటల్ ముందుంటుందని అన్నారు . సభాధ్యక్షులు వీబీటీ రాజు మాట్లాడుతూ గత 63 సంవత్సరాలుగా గ్రామాల్లో పీఎంపీలు



గ్రామాల్లో ప్రజలకు పల్స్ పోలియో, మలేరియా ఎయిడ్స్,క్యాన్సర్ వంటి వ్యాధులపై అవగాహన కల్పించడం,సరైన సమయంలో ఏ వ్యాధి కి ఏ వైద్య నిపుణుల వద్దకు తీసుకుని వెళ్ళాలో అవగాహన కల్పించి ఎంతోమంది ప్రాణాలు కాపాడినవారవుతున్నారని,ఈ ఏడాది అంతా అవయవదానం పై రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో అవగాహన కల్పించడమే లక్ష్యం గా తీసుకున్నామని అన్నారు.ఆశ్రం హాస్పిటల్ సీఈఓ కే హనుమంతరావు మాట్లాడుతూ ఆరవై మూడు వసంతాలు పూర్తి చేసుకున్న పీఎంపీలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ గ్రామాల్లో ఎవరికి ఏ అనారోగ్యం వచ్చిన ముందుగా స్పందించి సేవలందించేది పీఎంపీలేని వీరి సేవలను కొనియాడారు.ఏపీఆర్ జేఏసీ న్యాయ సలహాదారు డాక్టర్ ఎన్ఎల్ రావు మాట్లాడుతూ భారతదేశం లో నేటికీ వైద్య సేవలు అందుతున్నాయంటే అది పీఎంపీల వల్లనేనని, పీఎంపీలు సామాజిక సేవలతో ప్రజాదరణ పొందాలని,ఎప్పటికప్పుడు నూతన వైద్య విధానాలపై అవగాహన పొందాలని సూచించారు,ఏలూరు జిల్లా పార్లమెంట్ టీడీపీ యువనాయకులు పి హర్ష మాట్లాడుతూ పీఎంపీలు ఈ ఏడాది తీసుకున్న అవయవదానం నిర్ణయం ఎంతో ఉపయోగకరమైనదని అన్నారు.అనంతరం జరిగిన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులో ఆశ్రం హాస్పిటల్స్ జీసీఓఓ డాక్టర్ ఎస్ రాజరాజన్,సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ శైలజ సూర్యదేవర,కమ్యూనిటీ మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ ఎన్ పార్ధసారథి, అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ బాపూజీ, యూరాలజిస్ట్ ఎన్వీ ప్రదీప్ కుమార్ లు హాజరై క్యాన్సర్ గురించి, అవయవదానం గురించి వివరించారు.అలాగే నూతన వైద్య విధానాల గురించి, ఏఏ వ్యాధులను ఏ విధంగా గుర్తించాలో ఏఏ కేసులను హాస్పిటల్ కు రిఫర్ చేయవల్సి ఉంటుందో తెలిపారు.జాతీయ ఉపాధ్యక్షులు,రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు,రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగుమళ్ళ రాంబాబు, రాష్ట్ర గౌరవ సలహాదారు కోన చిన్నారావు,రాష్ట్ర మీడియా కన్వీనర్ బళ్ళా శ్రీనివాసరావు, ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆనందం సుబ్బారావు, కార్యదర్శి ఎమ్ జయరామ్,పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు జిల్లా ఏఆర్కే పరమేశ్వరులు,కార్యదర్శి ఎస్కే సుభాన్,కోశాధికారి ఎం జితేంద్ర,సీనియర్ సభ్యులు ఎల్ఎస్వీ నాగేశ్వరరావు లు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా లోని అన్ని మండలాల సభ్యులు హాజరయ్యారు.

# కేబినెట్ మంత్రులు మీ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రశ్నించుకో..

### మంత్రిత్వ శాఖలకు కనీస నిధులు లేవు,పాలన అమలు చేసే యంత్రాంగం లేదు
### పిజిఆర్ఎస్ ఫిర్యాదులను ఉద్యోగులు గోల్ మాల్ - మేడా శ్రీనివాస్ తీవ్ర ఆక్షేపణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మంత్రిత్వ శాఖలకు కనీస నిధులు లేవు, పాలన అమలు చేయగలిగే యంత్రాంగం లేదు అని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ నేరుగా విమర్శించారు. పాత్రికేయులతో మేడా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మంత్రుల స్థానంలో ఉత్తుత్తి మంత్రులు కొనసాగుతున్నారు.ఏ శాఖ పైనా మంత్రులుగా చలామణి అవుతున్న వారికి పట్టు లేకపోతుంద న్నారు.కేవలం మంత్రి హోదాలను ఎంజాయ్ చేస్తున్నట్టుగానే ఏపి కేబినెట్ పని తీరు కనపడుతుందాన్నారు. బాధితుల పిర్యాదులపై కనీస స్పందన లేకపోతుందాన్నారు. పి.జి.ఆర్.ఎస్ పిర్యాదులను దిగువ స్థాయి ఉద్యోగులు గోల్ మాల్ చేస్తు వాస్తవ స్టేట్మెంట్స్ స్థానంలో నకిలీ స్టేట్మెంట్స్ ను పై ఉన్నత అధికారులకు,సీఎం కార్యాలయానికి పంపిస్తున్నారన్నారు . నిజాలను భూస్థాపితం చేస్తున్నారు.పి జి ఆర్ ఎస్ లక్ష్యాన్ని కొంతమంది అవినీతి అధికారులు దారి మళ్లిస్తున్నారని , సొంత లాభాలు పొందుతున్నార న్నారు.ప్రస్తుత ఏపి కేబినెట్ లో వున్న మంత్రులకు ప్రజల భవిష్యత్ కోసం ఏమి అవసరం వుంది . ఆంధ్రప్రదేశ్ ప్రగతికి ఏమి చేయాలి అని ఆలోచన లేకపోయింది.కేవలం అధిష్టానం పై భయం తో కూడిన భక్తి ,భయం తప్ప మరొకటి లేకపోయిందన్నారు . ఆంధ్రప్రదేశ్ లో అమల్లో ఉన్నటు వంటి వివిధ శాఖలకు స్వేచ్ఛ గల మంత్రులు ఉన్నారా ! జీతాలు , ఇతర సంపదకు , సౌకర్యాలకు అలవాటు బానిసలుగా మొద్దు బారి పోయారా అనే సందేహాలు ఆంధ్రప్రదేశ్ ప్రజలను వెంటాడుతున్నాయన్నారు . ఈ తరహా మంత్రి వర్గంతో ఆంధ్రప్రదేశ్ కు మంచి భవిష్యత్ ఉంటుందా ! ఆంధ్రప్రదేశ్ కు అద్భుతమైన భవిష్యత్ ,పెట్టుబడుల వర్షం ,మరో సింగపూర్ అనే కార్పొరేట్ మీడియా వార్తలతో సంతృప్తి పడటమేనా !లేక ఆంధ్రుల జీవితాలు ఇంతే నంటు నిత్య ఘోషతో చస్తు బ్రతకటమేనా అని ఆయన తీవ్ర మనస్థాపం చెందారు. నేడు అధికారాన్ని అనుభవిస్తున్న వారు అంత ప్రజలకు విధేయులుగా కాకుండా అధిష్టానంకు , వారి వారసులకు మాత్రమే విధేయులుగా వుంటున్నారు . పేరుకు మాత్రమే మంత్రులుగా ఉనికిని చాటుకుంటున్నారు . ఈ మంత్రులు అందరకు సిట్ , స్టాండ్ తప్ప ఏ అధికారం లేకపోవటం విశేషం అన్నారు . ఒకొక్క మంత్రి ప్రతి నెల ప్రభుత్వ జీతంతో పాటుగా 25 కోట్లు దొడ్డి దారిన తీసుకుంటు ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెట్టడమే మంత్రి విధులు అన్నట్టు పుంకాను పుంకాలుగా ప్రచారాలు జోరుమంటున్నాయన్నారు. ఏ మంత్రి సొంత నిర్ణయాలు తీసుకునే సాహసం చేయకపోగా సాధారణ పాలనా వ్యవహారాలు కూడా నెల ముడుపులు పంపే వారి నుండే ఆదేశాలు రావటం కోసం ఎదురు చూడటం బాదాకారమ్మన్నారు . ప్రజలకు పౌర సేవలు ఎలా అమలు కావటం లేదో , మంత్రుల స్వేచ్ఛ కూడా ఆవిరి అయిపోవటం కూడా నిజం అన్నారు. రోజు వారి శ్రమ కూలిని జట్టు లేబర్ ఏ విధంగా సాయత్రం పంచుకుంటారో, మంత్రుల ముడుపులు ప్రతి నెలా పంచుకుతున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయాన్నారు. నేరుగా తన శాఖ అధికారులుకు ఫోన్ చేసి సమస్య పరిష్కరించమని చెప్పే దమ్మున్న మంత్రి నేటి కేబినెట్ లో లేకపోవటం దురదృష్టం అన్నారు . మంత్రిత్వ శాఖ లకు కనీస నిధులు కూడా లేవని, పాలన అమలు చేయగలిగే యంత్రాంగం లేదని కూడా గమనించలన్నారు . కొన్ని శాఖల్లో స్టేషనరి కూడా లేకపోతుందని, బాధితుల చేతనే పేపర్లు కొనిపించుకుంటు పాలన సాగిస్తున్నారని ఆయన అవహేళన చేసారు.ఈ పాలకులకు భయట పల్లకి మోత తప్ప ఇంట్లో మాత్రం నిత్యం కుంపట్ల సెగే ఉంటుందన్నారు . ఆంధ్రప్రదేశ్ పాలనను ఆంధ్రులు సంస్కరించుకునే గురుతర బాధ్యతను వజ్ర సంకల్పంతో చేతభూనే సదావకాశం నేడు ఆంధ్రులకు ఆసన్నమైదన్నారు . సభకు అర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ డి.వి రమణ మూర్తి,దుడ్డే సురేష్, వర్ధనపు శరత్ కుమార్, ఎమ్ డి హుస్సేన్, దుడ్డే త్రినాద్, మేడిచర్ల శ్రీనివాసరావు, గుడ్ల సాయి దుర్గా ప్రసాద్, బసా సోనియా,దోషి నిషాంత్, వల్లి శ్రీనివాసరావు చల్లా సాంబశివరావు,లంక వీర వెంకట సత్యనారాయణ, సుంకర వెంకట భాస్కర రంగారావు, చల్లా వంశీ, కందివలస రమణ,మాసా అప్పాయమ్మ, అలజంగి రాజు, పెంటపాటి శ్రీను అడపా శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి
# శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రం అల్లవరం గ్రామంలో 2 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం కోసం ఎమ్మె ల్యే అయితాబత్తుల ఆనందరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం పట్ల కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు.అందుకే ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అమూడ చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, బందిగుప్తాపు సత్తిబాబు, నడింపల్లి సుబ్రమణ్యం రాజు, వేగిరాజు వెంకటరాజు, జనసేన నాయకులు కంకిపాటి గోపి, కంకిపాటి వీరబాబు, పచ్చిమాల ఏడుకొండలు, ముత్యాల బాబీ, బొక్క ప్రసాద్, చిట్టినిడి దానయ్య నాయుడు, కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్ బాబు, నాగరజు,రాసురి రాంబాబు, గుబ్బల చిన్నబాబు , సుంకర సాయి మరియ తదితరులు పాల్గొన్నారు.

# సోమవారం యధావిధిగా అర్జీలు స్వీకరణ

### జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డిసెంబర్ 29వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వినతుల స్వీకరణ కార్యక్రమం జిల్లాస్థాయిలో స్థానిక కలెక్టరేట్ గోదావరి భవన్ నందు యధావిధిగా ఉంటుందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుం దని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కా రానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టను న్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబం ధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని జిల్లా కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను మీకోసం.యాప్.జి వి ఓ.ఇన్ వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేం దుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చునని ఆయన ప్రకటనలో తెలిపారు.

# హెల్త్ వాయిస్




మనలో కొబ్బరి నీళ్లను ఇష్టంగా తాగుతూ ఉంటారు. కొబ్బరి నీళ్లు రుచిగా ఉంటాయి. పెద్దలే కాకుండా పిల్లలు కూడా ఈ నీటిని తాగడానికి ఇష్టపడతారు. కాలంతో సంబంధం లేకుండా అన్ని వేళలా మనకు ఈ కొబ్బరి నీళ్లు లభిస్తుంటాయి.మనలో కొబ్బరి నీళ్లను ఇష్టంగా తాగుతూ ఉంటారు. కొబ్బరి నీళ్లు రుచిగా ఉంటాయి. పెద్దలే కాకుండా పిల్లలు కూడా ఈ నీటిని తాగడానికి ఇష్టపడతారు. కాలంతో సంబంధం లేకుండా అన్ని వేళలా మనకు ఈ కొబ్బరి నీళ్లు లభిస్తుంటాయి. అయితే చాలా మంది ఈ నీటిని వేసవికాలంలో మాత్రమే తాగుతూ ఉంటారు. అలాగే అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు మాత్రమే కొందరికి ఈ నీరు గుర్తుకు వస్తుంది. కానీ కొబ్బరి నీటిని తరచూ ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈ కొబ్బరి నీళ్లను ఉదయం ఖాళీ కడుపుతో తీసుకోవడం వల్ల మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చని వారు సూచిస్తున్నారు. పరగడుపున కొబ్బరి నీళ్లను తీసుకోవడం వల్ల మనకు కలిగే లాభాల గురించి వారు వివరిస్తున్నారు.

**డీహైడ్రేషన్ రాకుండా..**

కొబ్బరి నీళ్లల్లో ఎలక్ట్రోలైట్స్ అధికంగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటుంది. చెమట ద్వారా శరీరం కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్ తిరిగి లభిస్తాయి. అంతేకాకుండా ఉదయం పూట కొబ్బరి నీరు ఒక రీఫ్రెష్‌మెంట్ డ్రింక్ లాగా పని చేస్తాయి. నీరసం, అలసట వంటి సమస్యలతో బాధపడే వారు కొబ్బరి నీటిని తీసుకోవడం వల్ల ఎంతో మేలు కలుగుతుంది. వీటిలో ఉండే సహజ చక్కెరలు, ఎలక్ట్రోలైట్స్ శక్తిని పెంచడంలో సహాయపడతాయి. అయితే వీటిని తగిన మోతాదులో మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కొబ్బరి నీళ్లల్లో మైక్రోబయాల్ లక్షణాలు ఉంటాయి. ఇవి పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. అంతేకాకుండా కొబ్బరి నీటిని తాగడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది. ఉబ్బరం, మలబద్దకం వంటి జీర్ణ సమస్యలు రాకుండా ఉంటాయి.

**బీపీ తగ్గేందుకు..**

అధిక రక్తపోటుతో బాధపడే వారు కొబ్బరి నీళ్లను తీసుకోవడం వల్ల మంచి ప్రయోజనాలను పొందవచ్చు. కొబ్బరినీళ్లల్లో పొటాషియం తగిన మొత్తంలో ఉంటుంది. ఈ నీటిని తరచూ తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. కొబ్బరి నీళ్లల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆకలి త్వరగా వేయకుండా ఉంటుంది. శరీరంలో జీవక్రియ వేగం కూడా పెరుగుతుంది. కనుక బరువు కూడా అదుపులో ఉంటుంది. కొబ్బరి నీరు శరీరంపై ఆల్కలైజ్ ప్రభావాన్ని చూపిస్తుంది. శరీరంలో ఆమ్లాలను తగ్గించడంలో, శరీరంలో పిహెచ్ స్థాయిలను తగ్గించడంలో కొబ్బరి నీరు మనకు ఎంతో సహాయపడుతుంది.

**కిడ్నీల ఆరోగ్యానికి..**

మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా కొబ్బరి నీరు మనకు ఉపయోగపడుతుంది. మూత్రపిండాల్లో రాళ్లు, మూత్ర నాళాల ఇన్ఫెక్షన్ లతో బాధపడే వారు కొబ్బరి నీటిని తాగడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఈ విధంగా కొబ్బరి నీళ్లు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. అయితే ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికి కొబ్బరి నీటిని తగిన మోతాదులో మాత్రమే తీసుకోవాలి. అప్పుడే మనం ఆరోగ్య ప్రయోజనాలను పొందే అవకాశాలు ఉంటాయి. లేదంటే నష్టమే జరుగుతుంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
సోమవారం, 29 డిసెంబర్ 2025
www.viswamvoice.com





## రెడ్డి సుబ్రహ్మణ్యంని కలిసిన కొత్తపేట శెట్టిబలిజ యువజన సంఘం నూతన కార్యవర్గం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్, ప్రముఖ శెట్టిబలిజ జాతీయ నాయకులు రెడ్డి సుబ్రహ్మణ్యంని నూతనంగా ఎన్నికైన శెట్టిబలిజ యువజన సంఘం కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కొత్తపేటలోని ఆయన స్వగృహం నందు జరిగిన భేటీలో నూతన కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యంని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యువకమిటీ సభ్యులకు రెడ్డి సుబ్రహ్మణ్యం పలు సూచనలు చేశారు. క్రమశిక్షణతో కూడిన నాయకత్వం ద్వారానే సంఘం బలోపేతం అవుతుందని ఆయన ఆకాంక్షించారు. సామాజిక సేవా కార్యక్రమాలు కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా, పేద విద్యార్థులకు తోడ్పాటు అందించడం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం మరియు సామాజిక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కార్యవర్గానికి సూచించారు. కుల సంఘాల బలోపేతం ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, యువత అంతా ఒక్క తాటిపైకి వచ్చి సామాజిక బాధ్యతగా పనులు చేయాలని పిలుపునిచ్చారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలుపుతూ, సుబ్రహ్మణ్యం సూచనల మేరకు శెట్టిబలిజ యువజన సంఘం ఆధ్వర్యంలో ముందు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ యువజన సంఘం నూతన అధ్యక్షులు శీలం కొండబాబు, ఉపాధ్యక్షులు జోగి మురళి, ప్రధాన కార్యదర్శి రాయుడు కార్తీక్, గౌరవ అధ్యక్షులు కొప్పిశెట్టి వాసు, ముసిని వెంకటరమణ, సంఘ సభ్యులు కదలి భీమా, కముజు తాతాజీ, మామిడిశెట్టి బాలాజీ, దెంగేటి సాయి, శ్రీరామ్, గని, నూతన కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### కొడమంచిలి శ్రీనివాస్ తల్లి కృష్ణవేణికి
## నివాళులర్పించిన చింతా అనురాధ



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం మొగళ్లమూరు గ్రామానికి చెందిన ఆర్ఎంపి డాక్టర్ కొడమంచిలి శ్రీనివాస్ తల్లి కృష్ణవేణి ఇటీవల మరణించగా, వారి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ సానుభూతి తెలిపారు.

## కలశం ఫుడ్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట కౌశిక రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కలశం ఫుడ్స్ షాపును కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. సాంప్రదయ రుచులతోపాటు కోనసీమ రుచులను వినియోగదారులకు అందించే కలశం ఫుడ్స్‌ను ప్రారంభిస్తున్న ప్రొప్రైటర్ చింతలూరి సూర్యప్రకాష్‌కు అభినందనలు తెలియజేసి, వ్యాపార అభివృద్ధి జరగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## ముత్యాల బాబ్జికి శుభాకాంక్షలు తెలిపిన బిజెపి నాయకులు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులు అయిన టీడీపీ సీనియర్ నాయకులు ముత్యాల బాబ్జిని రాష్ట్ర బిజెపి యువ మోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయ ప్రకాష్ నారాయణ (జేపీ) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియచేసారు. అనంతరం జేపీ మాట్లాడుతూ టీడీపీ పార్టీ పాటిష్టత కోసం ఎమ్మెల్యే బండారు సత్యనందం విజయంలో కూడా ఎంతో నిబద్దత తో పనిచేసిన బాబ్జికి ఈ పదవి రావడం ఎంతో శుభపరిణామం అని జేపీ అన్నారు భవిష్యత్తు లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలి అని కొనియాడారు. ఈ కార్యక్రమం లో ఆత్మ కమిటీ డైరెక్టర్ పాలాటి మాధవ స్వామి, బిజెపి మాజీ జిల్లా కార్యదర్శి గొలకోటి వెంకటేశ్వరరావు, ఆర్ యాస్ యాస్ కొత్తపేట కండ ప్రముక్ తోగరు ఆంజనేయులు, సబ్బవరపు సత్యనారాయణ, బల్ల రాజు, ఇళ్ల పళ్ళాంశెట్టి, మండల యువ మోర్చా అధ్యక్షులు వలపశెట్టి కిరణ్, అన్యం సత్యనారాయణ, గ్రంధి నవీన్,శివ రామకృష్ణ, కోటిపల్లి పల్లంరాజు, ముద్రగడ ఫణి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు





**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం మండలం ఈదరపల్లిలో ఉన్న హెూలీ ఆర్మీ ఫెలోషిప్ ఎస్.యెహెూన్ ఫాదర్ ఆద్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పాస్టర్, ముత్తయి క్రీస్తు జనన విధానము కోసం క్రిస్మస్ సందేహాన్ని అందించారు. ఈ సందర్భంగా సుమారు 400 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు హాజరైె దైవజనులు ఇచ్చిన దైవ సందేశం విన్నారు.

### మంత్రి సుభాష్‌చే రూ.70 లక్షలతో
# అభివృద్ధి పనులకు శ్రీకారం



**కె.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం కె.గంగవరం మండలం భట్లపాలిక గ్రామంలో రూ.70 లక్షలతో నిర్మించనున్న బిటి, సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం భూమి పూజ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.49.20 లక్షలతో నిర్మించనున్న బిటీ రోడ్డు, పీఎం ఏజెవై పథకం కింద రూ.20 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లుకు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పంచాయతీరాజ్ డిఈ కె.శ్రీనివాసరావు, ఎఈ యేసు రత్నం, కూటమి పార్టీ నాయకులు ఆధ్వర్యంలో కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ప్రజల మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రామచంద్రపురం నియోజవర్గంలో రూ.160 కోట్లుతో అభివృద్ధి పనులు చేపట్టామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పిఎసిఎస్ అధ్యక్షులు గెద్దం పల్లపురావు, రవ్వా నాగభూషణం, గ్రామ సర్పంచ్, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మహిళల జీవన ప్రమాణాలు పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

### ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంలో ఎల్పిజీ కనెక్షన్లు పంపిణీ చేసిన కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం



**కె.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళా సాధికారత, ప్రజల జీవన ప్రమాణాలు పెంచే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. కె.గంగవరం మండలం గంగవరంలో ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద మంజూరైన ఎల్పీజీ కనెక్షన్లను లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా ఆదివారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కోట లక్ష్మీ నరసమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ దేశంలో పేద కుటుంబాలకు స్వచ్ఛ వంట ఇంధనం (ఎల్‌పీజీ) కనెక్షన్లు అందించడం లక్ష్యంగా ప్రధానమంత్రి ఉజ్వల యోజన ప్రారంభించారన్నారు. గ్రామీణ ప్రాంతాల మహిళలకు ఎల్పిజి కనెక్షన్లను అందించడం ద్వారా వారి ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, ఇంటి పొగ కాలుష్యాన్ని తగ్గించి శ్వాస సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించే ఉద్దేశంతో పథకం విజయవంతంగా అమలు జరుగుతుందన్నారు. రామచంద్రపురం నియోజవర్గంలోని ప్రజల ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ నియోజకవర్గంలో సత్వర వైద్య సేవలు అందించేందుకు త్వరలో ఒక బస్సును ఏర్పాటు చేయనున్నారని, అలాగే ఒక ఆసుపత్రిని ఏర్పాటు చేసి అన్ని రకాల వైద్య పరీక్షలు అందేలా కృషి చేస్తున్నారన్నారు. ఒక ప్రత్యేకమైన విజన్ తో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే దిశగా నిధులు తీసుకొస్తున్నారని వివరించారు. మహిళాభివృద్ధికి, సాధికారతకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లు ఎనలేని కృషి చేస్తున్నారని ప్రశంసించారు. బిజెపి అనకాపల్లి జిల్లా ఇన్చార్జి కర్రి చిట్టిబాబు మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో ఎవరికి కష్టం వచ్చినా మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆపద్బాంధవుడులా ఆదుకుంటున్నారని కీర్తించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, మండల టిడిపి అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, మండల జనసేన అధ్యక్షులు సిర్రా రాజ్ కుమార్, పలువురు కూటమి పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 141వ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

### దేశం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం మరల అధికారంలోకి రావాలి



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా 141వ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు. అంబాజీపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొమ్మేటి వినోద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ 141 వఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీ పతాకావిష్కరణ, కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు మాచవరపు శివన్నారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశానికి చేసిన సేవలను కొనియాడినారు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దేశ ప్రజలకు ఉపయోగపడే నాగార్జునసాగర్ ప్రాజెక్టు, విశాఖ ఉక్కు కర్మాగారం, డి ఆర్ డి ఓ, శ్రీహరికోట వంటి ఎన్నో పరిశోధనా కేంద్రాలు నెలకొల్పి దేశ ప్రజలకు అంకితం చేశారు. ప్రస్తుతం నడుస్తున్న డబల్ ఇంజన్ ఎన్డీఏ సర్కార్ మాత్రం దోపిడీదారులకు, ఆర్థిక నేరస్తులకు కొమ్ముకాస్తుందని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. బిజెపి ప్రభుత్వం వచ్చి 12 సంవత్సరముల అయింది ఈ కాలంలో నరేంద్ర మోడీ ప్రధానిగా ఉన్నారు తప్ప మన రాష్ట్రానికి సంబంధించిన తలమానికమైనటువంటి పోలవరం ప్రాజెక్టు ఇంతవరకు పూర్తి చేయలేకపోయినా అసమర్ధ ప్రభుత్వం దేశాన్ని పరిపాలిస్తుందని విమర్శించారు. దేశం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం మరల అధికారంలోకి రావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఇస్మాయిల్ షరీఫ్, మలపర్తి మోహనరావును సాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు కొల్లి సరోజిని, మహమ్మద్ అబీబ్, బొంతు శివ, మట్టపర్తి వెంకటేశ్వరరావు, మట్టపర్తి శ్రీను, యుగంధర్ ఇతరులు పాల్గొన్నారు.

### కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో
# కాంగ్రెస్ పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండపేట పట్టణంలోని కలువపువ్వు సెంటరు వద్ద నిర్వహించారు. నూతనంగా నిర్మించిన భారత జాతీయ కాంగ్రెసు పార్టీ జెండా స్తూపంను ఆదివారం ఉదయం అఖిల భారత కాంగ్రెస్ పార్టీ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ జెండాను కామన ఎగరు వేశారు. తొలుత జాతిపిత మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కామన మాట్లాడుతూ 1885వ సంవత్సరం డిసెంబర్ 28వ తేదీన బొంబాయి నగరంలోని గోకుల్ దాస్ తేజ్ పాల్ సంస్కృత కళాశాలలో మొట్ట మొదటి కాంగ్రెస్ సమావేశం బ్రిటిష్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఏఓ హెూమ్ ఆధ్వర్యంలో జరిగిందన్నారు. ఈ సమావేశం కు ఉమేష్ చంద్ర బెనర్జీ అధ్యక్షత వహించారని తెలిపారు. ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా 72 మంది ప్రతినిధులు పాల్గొని దేశ స్వతంత్ర కోసం కాంగ్రెస్ పార్టీ నీ స్థాపించారని పేర్కొన్నారు. మహాత్మ గాంధీ నేతృత్వంలో 1920 లో స్వాతంత్ర పోరాటం ను ప్రారంభి, కాంగ్రెస్ పార్టీ అహింసా మార్గంలో స్వతంత్రం సాధించిందన్నారు.దేశం అభివృద్ధి చెందడానికి కాంగ్రెస్ పార్టీ ప్రధాన పాత్ర పోషించినదని పేర్కొన్నారు. ముఖ్యంగా తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పంచవర్ష ప్రణాళికలు అమలుచేసి దేశం లో అనేక ప్రాజెక్టులు నిర్మించి ప్రజల కోసం పాటుపడిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని కొనియాడారు. జై జవాన్, జై కిసాన్ నినాదం తో లాల్ బహదూర్ శాస్త్రి మరింత అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ బ్యాంకులు జాతీయం చేసి సామాన్యులకు అందుబాటు లోకి తీసుకొని వచ్చారని పేర్కొన్నారు. ఇండ్లు లేని వారికి ఇండ్లు, భూమి లేని వారికి భూములు పంపిణీ చేశారన్నారు.రాజీవ్ గాంధీ నేతృత్వంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నీ అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని పేర్కొన్నారు.పీవీ నరసింహారావు నేతృత్వంలో సరళి కృత్రిమ విధానాలు అందుబాటులోకి తెచ్చాయన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ను తీసుకుని వచ్చి 100 రోజులు పనిదినాలను తీసుకుని అందరికి పని కల్పించి న ఘనత కాంగ్రెస్ పార్టీ దని పేర్కొన్నారు. నేటి బిజెపి ప్రభుత్వం మహాత్మ గాంధీ పేరును తొలిగించడం, కేంద్ర ప్రభుత్వం 100 శాతం ఇవ్వవలసిన గ్రాంట్ ను 60 శాతం కేంద్ర వాటా,40 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా గా మార్చడం ద్వారా త్వరలోనే ఈ పథకాన్ని ఎత్తివేయాలని చూస్తుందని పేర్కొన్నారు. దేశంలో ను, రాష్ట్రం లోను కాంగ్రెస్ పార్టీ నీ తిరిగి తీసుకుని రావాలని కోరారు. ఈ సందర్భంగా కామన ప్రజల చేత కాంగ్రెస్ పార్టీని తిరిగి తీసుకొని వచ్చేవరకు కృషి చేస్తామని, బీజేపీ నుండి దేశాన్ని రక్షించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో పాడిశెట్టి సత్యనారాయణ, గేదెల శ్రీనివాస్, అలమండ సూరిబాబు, ముగ్గుల శ్రీను, పర్వతిన వీర వెంకట సత్యనారాయణ చౌదరి ,చింతా వెంకట రెడ్డి,కుచ్చు బాబీ, వల్లభదాసు చిన్న, గంధ్రోతుల రామచంద్ర రావు, వాసిరెడ్డి బాబురావు, జొన్నాడ ప్రసాద్, రామిశెట్టి సరయ్య, జువ్వల ఆదినారాయణ, నామాల కృష్ణ, గెద్దడ వీర బ్రహ్మం, ఆబోతు వీరభద్రం, చిన్నారావు, కొక్కిరాల రామకృష్ణ, పెద్దిరెడ్డి మురళీ కృష్ణ, బండారు నాగేశ్వరరావు, ముత్యాల కృష్ణ, పాస్టర్ వెంకట్రావు, సమ్మాని, కొండ సతీశ్, పిల్లి అప్పన్న, బండారు వెంకటేశ్ బి.శివ, కె. ప్రసాద్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### నిరుపేద కాపు విద్యార్థిని కొల్లాటి స్వరూపకు
## రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేత



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం నిరుపేద కాపు విద్యార్థిని స్వరూపకి నందం చేతులు మీదుగా పది వేలు రూపాయలు ఆర్థిక చేయూత మండలం పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన కాపు విద్యార్థిని కొల్లాటి స్వరూపకు కొత్తపేట నియోజకవర్గ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5 వేల రూపాయలు రావులపాలెం గ్రామానికి చెందిన ఎస్‌విఎస్ జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్, లారీ ట్రాన్స్పోర్ట్ అధినేత శ్రీ కృష్ణ దేవరాయ కాపు సంఘం అధ్యక్షులు నందం వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో 5 వేల రూపాయలు కలిపి మొత్తం 10,000 వేల రూపాయలు ఉన్నత చదువుల నిమిత్తం ఆర్థిక సాయాన్ని ఆదివారం నాడు రావులపాడులోని నందం లారీ ట్రాన్స్పోర్ట్ కార్యాలయంలో ఆయన చేతులు మీదుగా అందజేశారు చదువులో రాణిస్తున్న నిరుపేద కాపు మహిళలైన విద్యార్థిని స్వరూపను కాపు పెద్దలు నందం.కాపు టీచర్స్ అసోసియేషన్ సభ్యులు దుస్సాలతో సత్కరించారు ఉన్నత చదువుల కోసం భవిష్యత్తులో ప్రోత్సాహాన్ని అందిస్తామని ఈ సందర్భంగా వీర వెంకట సత్యనారాయణ. కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కత్వ అధ్యక్షులు అద్దరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి అడపా శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి అక్కిరెడ్డి సూర్యనారాయణ, సభ్యులు తోటరాముడు, అన్యం శ్రీనివాస్, చీమల నాగేశ్వరరావు, సలాది శ్రీనివాస్, సింగనూరి దుర్గాప్రసాద్, చోడపునీడి శివ,తదితరులు పాల్గొన్నారు.

## సాధనాల శివకు బోస్, చింత అనురాధ పరామర్శ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై శస్త్ర చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటున్న వైయస్సార్ పార్టీ నాయకుడు సాధనాల శివ భగవాన్ ను రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ పరార్శించారు. ఆయన తో బాటు అమలాపురం మాజీ పార్లమెంటు సభ్యురాలు చింతా అనురాధ, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, అంబేద్కర్ కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ మాజీ అధ్యక్షులు వేగుళ్ల పట్టాభిరామయ్యా చౌదరి లు పరామర్శించారు.10వ వార్డు కొండపల్లి వారి ఆలయం వద్ద ఉన్న వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఆదివారం సాధనాల శివ పుట్టినరోజు కావడంతో శుభాకాంక్షలు తెలియజేసి, ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎర్నేన ప్రభావతి,షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా,వైసీపీ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ విభాగం కార్యదర్శి శెట్టి నాగేశ్వరరావు,వైస్సార్సీపీ నాయకులు మొండి మురళి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భాష్యం అంతర్గత బాలికల క్రీడోత్సవాలు




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** చదువులో క్రీడలు ఒక భాగం కావాలని అప్పుడే విద్యార్థులు చదువులో చురుగ్గా ఉండి మంచి మార్కులు సాధిస్తారని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బివి వి సుబ్రహ్మణ్యం అన్నారు. భాష్యం స్కూల్ కోనసీమ జోనల్ ఇంచార్జ్ జవ్వాది వెంకట శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన భాష్యం ఇంట్రా జోనల్ బాలికల స్పోర్ట్స్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం, తాటిపాక, మండపేట, మలికిపురం, ముమ్మిడివరం, రావులపాలెం, కొత్తపేట, పాలకొల్లు, నరసాపురం శాఖలు పాల్గొన్నట్టు, బాలురకు సోమవారం నిర్వహించనున్నట్లు అమలాపురం బ్రాంచ్ ప్రిన్సిపల్ సిహెచ్ రవి పేర్కొన్నారు. గెలుపొందిన విజేతలకు సి ఎం ఓ.సుబ్రహ్మణ్యం, జెడ్ఇ ఓ.శ్రీనివాస్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో 9 శాఖల ప్రిన్సిపల్స్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వాడపల్లి నుంచి నల్లా పవన్‌కి ఆహ్వానం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహెూత్సవానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్‌కి ఆహ్వానించారు. భారతీయ జనతా పార్టీ నుంచి ధర్మకర్తల మండల సభ్యులుగా ఎన్నికైన సీనియర్ నాయకులు శిష్టా కుటుంబరావు అమలాపురంలో నల్లా పవన్‌ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వాడపల్లి వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేసి ప్రమాణస్వీకారం మహెూత్సవానికి రావలసిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నల్లా పవన్ మాట్లాడుతూ సీనియర్ నాయకులుగా శిష్టా కుటుంబరావు కి ధర్మకర్తల మండలి సభ్యులుగా ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కోనసీమ తిరుమల గా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి వెంకటేశ్వర స్వామిని అనేకమంది భక్తులు ఏడు వారాలు ఏడు ప్రదక్షిణలు చేసి దర్శనం చేసుకుంటారని, ఈ ప్రమాణస్వీకారానికి జిల్లా బీజేపీ శ్రేణులు హాజరై, స్వామివారిని దర్శించుకోవాలని కోరుతున్నానని తెలిపారు.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ జిల్లా ఎడిషన్

సోమవారం, 29 డిసెంబర్ 2025
www.viswamvoice.com






# ప్రత్తిపాడు పోలీసుల ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి ఒక్కరూ వారానికి ఒక రోజు సైకిల్ తొక్కడం వల్ల శరీరానికి వ్యాయామం మేలు కలుగుతుందని, దాంతోపాటు పర్యావరణాన్ని పరిరక్షించినట్లు అవుతుందని ప్రత్తిపాడు సిఐ. బి.సూర్యఅప్పారావు అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు మండలం ప్రత్తిపాడు స్థానిక పోలీస్ స్టేషన్ నుండి పోలీస్ సిబ్బంది, స్థానిక యువకులతో కలిసి ఆదివారం సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ బివిఎస్ అప్పారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫిట్ ఇండియా కార్యక్రమానికి పిలుపును ఇచ్చాయని, ఇందులో భాగంగా ప్రతి ఆదివారం "సండే ఆన్ సైకిల్" కార్యక్రమాన్ని పోలీస్ శాఖ నిర్వహిస్తుందని అన్నారు. ప్రస్తుతం మన అందరి జీవన శైలిలో ప్రతి రోజూ ఎక్కువగా మోటార్ సైకిళ్లు, కార్లలో ప్రయాణించడం జరుగుతోందని, ఆధునిక సౌకర్యాలతో జీవనం సాగిస్తూ ఉన్నందున శారీరక చురుకుదనం లేకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు రోజు రోజుకూ పెరుగు తున్నాయని అన్నారు. మన ఆరోగ్యాన్ని కాపాడు కోవడం, ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపడం ప్రస్తుత కాలంలో అత్యంత ముఖ్యమని, అందులో భాగంగా తమ దైనందిన జీవన శైలిలో కొంత సమయం సైక్లింగ్ ను అలవాటుగా చేసుకుని శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ప్రతి రోజు విధి నిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, అలాంటి సమయంలో ఆరోగ్యాన్ని పరిరక్షించు కోవడం తప్పనిసరని, అందుకు సైక్లింగ్ ను ఒక అలవాటుగా చేసుకుని శారీరక దఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడు కోవడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ప్రత్తిపాడు సిఐ. బి.సూర్య అప్పారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కూడా పాల్గొన్నారు.

### అలయన్స్ క్లబ్ శరవణ ఆధ్వర్యంలో
# పేదలకు చీరలు పంపిణీ
### శరవణ్ కుమార్ 30వ వర్ధంతి వేడుకలు



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ శరవణ ఆధ్వర్యంలో ఆదివారం వెంకట్నగర్లోని శ్రీనివాసం అపార్ట్మెంట్ వద్ద మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా భావంతో పేద ప్రాంత మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టి మానవత్వానికి నిదర్శనంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు యాళ్ళ రత్నరావు జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అలయన్స్ క్లబ్ విలువలను ప్రతిబింబిస్తుందని, సమాజంలో సేవా స్ఫూర్తిని పెంపొందిస్తుందని తెలిపారు. ముఖ్య అతిథి పెంకే గోవిందరాజు మాట్లాడుతూ అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ శరవణ చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సామాజిక బాధ్యతను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొవ్వూరి మునిరెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగత వేడుకలను సేవతో ముడిపెట్టడం వల్లే వాటికి నిజమైన అర్థం వస్తుందని, యువత ఈ మార్గాన్ని అనుసరించాలని సూచించారు. మరొక పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మాట్లాడుతూ, అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ శరవణ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు. క్లబ్ వ్యవస్థాపకులు దిలీప్ కుమార్ సధనాని మాట్లాడుతూ, సభ్యులందరూ కలసి సేవా కార్యక్రమంలో పాల్గొనడం ఆనందకరమని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవలో చేతులు కలిపారు. ముఖ్యంగా ఉపాధ్యక్షులు అల్లై. యాదవిల్లి మురళీధర్, టీఆర్. ఠాగూర్ రామమోహన్ రావు, కుటుంబరావు, పడాల సూర్యనారాయణ రెడ్డి, బండారు భాస్కరరావు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ శివకుమార్, పి.విజయలక్ష్మి, వి.ఉష, కే.చంద్ర శేఖర్, డివివి సత్యనారాయణ, జెఎస్వి లక్ష్మావతి, పిసంజీవ్ కుమార్, డిఎల్. శాస్త్రి, ఈశ్వరి మనోహర్ మలాది, కె.శ్రీలక్ష్మి, కొవ్వూరి పద్మ, యాళ్ళ పద్మ, కుడిపూడి వెంకటేశ్వరరావు, క్లబ్ సెక్రటరీ ధూళిపూడి రామకృష్ణ, క్లబ్ కోశాధికారి దామిశెట్టి శ్రీనివాసరావు, వివిఎన్ఎల్ కుమార్, సేతు మాధవ, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, జె గోపినాధ్, మలాది మృనాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సేవ, ఐక్యత, మానవత్వం అనే సందేశంతో విజయవంతంగా ముగిసింది.

# కాకినాడ పోర్టులో శుభ్రత కార్యక్రమం



**కాకినాడ పోర్ట్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ పోర్టులోని భారీ స్థాయిలో యాంకరేజ్ పోర్ట్ క్లీనింగ్ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. కోకనాడ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఏపీ మారిటైమ్ బోర్డు సహకారంతో ఈ కార్యక్రమం ఆదివారం ఉదయం జరిగింది. ఈ శుభ్రత కార్యక్రమం తెల్లవారు జాము నుంచే నిర్వహించారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గాదం చంద్రశేఖర్ (మహేష్) మాట్లాడుతూ కాకినాడ పోర్టులో ఎక్కడ చూసినా అపరిశుభ్రత నెలకొని ఉందని అందువలన శుభ్రం చేసే కార్యక్రమం నిర్వహించాలని అన్ని సంఘాల వారితో అనుకోవడం వల్ల ఈ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టామన్నారు. పోర్టు పరిశుభ్ర పరిచే కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని మహేష్ అన్నారు. ఈ శుభ్రత కార్యక్రమంలో కస్టమ్స్ బ్రోకర్స్ అసోసియేషన్, స్టీవెడోర్స్ అసోసియేషన్, స్టీమర్ ఏజెంట్లు, షోర్ వర్కర్స్ యూనియన్, హెచ్ఎంఎస్ బార్జ్ వర్కర్స్ యూనియన్, తవ్వింగ్ వర్కర్స్ యూనియన్, తవ్వింగ్ మాస్టర్స్ అసోసియేషన్, స్టీవెడోర్ వర్కర్స్ యూనియన్, లారీ వర్కర్స్ యూనియన్, సర్వేయర్లు, షిప్ చాండ్లర్స్ తదితరులు సమర్థవంతంగా పాల్గొన్నారు. పోర్టు పరిసరాల పరిశుభ్రత, భద్రతను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించబడినట్లు నిర్వాహకులు తెలిపారు.

# గంజాయి మహమ్మారిపై ఉక్కుపాదం మోపాలి

### అంకితభావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి - అన్నవరం పోలీస్ స్టేషన్లో వార్షిక తనిఖీలు
### భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి - పెద్దాపురం ఎస్డీపీఓ శ్రీహరిరాజు వార్షిక తనిఖీలు



**అన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం పోలీస్ స్టేషన్ను పెద్దాపురం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి డి.శ్రీహరి రాజు శనివారం సందర్శించారు. స్టేషన్లో వార్షిక తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, పెండింగ్లో ఉన్న కేసుల పురోగతిని, ముఖ్యంగా దొంగతనం కేసుల ఛేదనపై సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో జరిగిన సమావేశంలో ఎస్డీపీఓ మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది అందరూ వృత్తి పట్ల అంకితభావంతో విధులను నిర్వర్తించాలని, అదే సమయంలో తమ ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని కూడా జాగ్రత్తగా చూసుకోవాలని హితవు పలికారు. అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తుల భద్రత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిత్యం పోలీస్ బీట్లు నిర్వహిస్తూ, ఎటువంటి దొంగతనాలు లేదా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా ఉంచాలని ఎస్ఐకి సూచించారు. ముఖ్యంగా పర్వదినాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పకడ్బందీ బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. యువతను పట్టిపీడిస్తున్న గంజాయి మహమ్మారిపై ఉక్కుపాదం మోపాలని, గంజాయి విక్రయించే వారిపట్ల, సేవించే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.సూర్య అప్పారావు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### శ్రీ భావనారాయణ స్వామి వారి
# ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే పంతం నానాజీ

**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం సర్పవరం శ్రీ భావన్నారాయణ స్వామి వారి దేవస్థానం లో ఆలయంలో గోశాల, గృహ సంకల్ప స్థానము, ఊయల మండపంతులాబారం,సుదర్శన యాగ శాల, ప్రసాదం కౌంటర్లను కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతంనానాజీ ప్రారంభించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆర్ శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే పంతం నానాజీకి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ అతి పురాతనమైన ఎంతో మహిమ కలిగిన భావనారాయణస్వామి వారి ఆలయ విశిష్టత దేశం నలుమూలల చాటి చెప్పాలని ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావునీ కోరడం జరిగిందని అన్నారు. ఆలయంలో నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభించేందుకు కృషి చేస్తున్న



ఈవో శ్రీనివాస్ ప్రత్యేకంగాఅభినందించారు. దేవస్థానంకి చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామని, కూటమి ప్రభుత్వంలో కబ్జాలు జరిగితే సహించేది లేదని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆలయ పాలకమండలి సభ్యులను త్వరలో నిర్ణయించడం జరుగుతుందని, వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉన్నట్లుగా ఇక్కడ కూడా గృహ సంకల్ప స్థానము తులాబారం ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు శిరంగు శ్రీనివాస నందిపాటి అనంతలక్ష్మి, త్రిమూర్తులు పుల్ల శ్రీరాములు ,బన్ను, రాందేవు సీతయ్యదొర పుల్ల వీరబాబు కర్ని శ్రీనివాస్ మానేపల్లి బాబ్జి, బస్వా చంటిబాబు, దినవహీపేరు బాబు, మామిడాల శ్రీనివాసరావు, పుల్ల వీరబాబు, మానేపల్లి వెంకటరమణ, కర్రీ వీర మణికంఠ, దొడ్డ ఆనంద, ముద్దన రవి, పాండ్రంకి రాజు పుల్ల శ్రీను, వాసంశెట్టి వెంకటేశ్వరరావు, గుత్తుల శ్రీను, గోవింద్, దాసరి శివ, జీని శ్రీను, సోదే ముసలయ్య, భాస్కర్, కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ పిఠాపురం ప్రజలకు కనపడరా..?

### మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ తెచ్చారా?
### జనవరి 18 చలో ఖమ్మంను జయప్రదం చేయండి - పిఠాపురంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభలో తాటిపాక మధు




**పిఠాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** చంద్రబాబు అవకాశవాద రాజకీయాలకు ఆద్యుడు అని మోడీ అధికారం లోకి వచ్చిన తర్వాత ఈ రాష్ట్రంకి ఒక్క పరిశ్రమ కూడా తీసుకు వచ్చారా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు ప్రశ్నించారు. ఆదివారం సాయంత్రం స్థానిక యానాదుల కాలనీ భగత్ సింగ్ నగర్ లో సీపీఐ శత దినోత్సవాలు ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి పట్టణం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పార్టీ పతకాన్ని తాటిపాక మధు ఆవిష్కరించారు . భగత్ సింగ్ విగ్రహంనాకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు సీపీఐ పిఠాపురం నియోజక వర్గ కార్యదర్శి శాఖ రామకృష్ణ అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రోద్యమంలో కమ్యూనిస్టులు కీలక భూమిక పోషించారని, బ్రిటిష్ వారిని దేశం నుంచి తరిమికొట్టడంలో అగ్రభాగాన నిలిచారన్నారు. ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం అనేక నిర్బంధాలకు గురై జైలుకు సైతం వెళ్ళారని గుర్తుచేశారు. దోపిడి సమాజం ఉన్నంతకాలం ఎర్రజెండా ఎగురుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. దేశ ప్రజల ప్రయోజనాలకే కమ్యూనిస్టు పార్టీ ప్రాధాన్యత ఇస్తుందని ప్రకటించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక్కరోజు కూడా పాల్గొనని చరిత్ర ఆర్ఎస్ఎస్ అని విమర్శించారు. జాతీయ పతాకాన్ని ఆమోదించి ఎగురవేయలేని శక్తిహీనులని, మీరు దేశభక్తి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. శ్రామిక జనుల హక్కుల కోసం అశేష త్యాగాలు చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని చెప్పారు. అనేక సంఘాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా విద్యార్థి, యువజన, మహిళ, రైతు, కార్మిక వర్గ హక్కుల కోసం నిలబడిన పార్టీ సీపీఐ అని అన్నారు. దేశం ఆయా రంగాలలో ముందుకు వెళ్ళిందంటే అందులో కమ్యూనిస్టులు ఆలోచన, దార్శనికత తప్పకుండా ఉంటుందని నొక్కిచెప్పారు. మోదీ అధికారంలోకి వచ్చిన ఈ 12 సంవత్సరాల కాలంలో దేశం ఏ రంగంలో ప్రగతి సాధించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్క భారీ పరిశ్రమను తెచ్చారా... ఒక్క భారీ ప్రాజెక్టునైనా నిర్మించారా అంటూ ప్రశ్నించారు. విద్యార్థి, యువజనులు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను సైతం ప్రైవేటీకరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. బ్యాంకులు, రైల్వే, రోడ్లు, ఎల్బాసీ ఇలా అన్ని వ్యవస్థలను అతలాకుతలం చేశారని, ఇప్పుడు ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి ఆ చట్టానికి కూడా తూట్లు పొడిచారని అన్నారు. కమ్యూనిస్టులు బలపడితేనే ప్రజల హక్కులు కాపాడబడతాయని చెప్పారు. స్వాతంత్రోద్యమంతో పాటు అనేక పోరాటాలు, భూ పోరాటాల్లో గుంటూరు జిల్లా నాయకులు అగ్రభాగాన నిలిచారని కొనియాడారు. వారి వారసత్వాన్ని, త్యాగాలు, విలువలు, పోరాటపటిమను మరింత ముందుకు తీసుకువెళ్ళాలని సూచించారు. జనవరి 18న జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవాలకు గుంటూరు జిల్లా నుంచి వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. పిఠాపురం నియోజక వర్గ లో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని డిప్యూటీ చీఫ్ మినిస్టర్ పవన్ కళ్యాణ్ గారు నియోజక వర్గం లో కనపడత లేదని అన్నారు రైతులు చాలా అసంతృప్తిగా ఉన్నారని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వారి రాజకీయ ప్రయోజనాల కోసం శ్రామికవర్గం చెమటోడ్చి సృష్టిస్తున్న సంపద మొత్తంను కార్పొరేట్లకు దోచిపెడుతుందని మండిపడ్డారు. ఆధునిక పెట్టుబడిదారి విధానం తమ స్వీయ ప్రయోజనాల కోసం ప్రస్తుత రాజకీయ వ్యవస్థను తమకు అనుకూలంగా వినియోగించుకుంటుందని అన్నారు. ఒకవైపు గాంధీని చంపిన గాడ్సేకు గుడులు కడుతూ... మరొవైపు మహాత్మాగాంధీ పేరుతో ఉన్న ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి జాతిపితను అవమానించిన ఈ ప్రభుత్వానికి ఒక్కరోజుకు కూడా ఢిల్లీలో కూర్చునే అర్హత లేదని విమర్శించారు. ఇంకా ఈ సభలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు కేత అరుణ ఏ మైది రాజు, రైతు సంఘం జిల్లా కన్వీనర్ నక్కా శ్రీనువాస్ రావు, చెరుకూరు గణపతి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా త్యాగరాజ ఆరాధనోత్సవం

### 500 మంది కళాకారులతో పంచరత్న సేవ
### వేడుకగా సాగిన సరస్వతి గానసభ మహోజ్వల ప్రస్థానం
### ఆకట్టుకున్న చాగంటి ప్రవచనం



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ స్థాయిలో పేరు ఉన్న సంగీత నృత్య నాటక కళారంగాలకు చెందిన కళాకారుల అద్భుత ప్రదర్శనలతో కాకినాడ ఆనందభారతి గ్రౌండ్స్ పులకించిపోయింది. దాదాపు 500 మందికి పైగా కళాకారులు ఒకే వేదికపై నుంచి చేసిన అద్భుత ప్రదర్శన ఆహూతులను కట్టిపడేసింది. సంగీత, నృత్య,నాటక రంగంలో వందేళ్లకు పైగా విశిష్ట సేవలందిస్తున్న సరస్వతీ గానసభ 122 వసంతాల మహోజ్వలల ప్రస్థానాన్ని పురస్కరించుకొని త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాన్ని అత్యంత భక్తిప్రధంగా వేడుకగా ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఇందుకు ఆనందభారతి గ్రౌండ్స్ వేదికైంది. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక సహా వివిధ రాష్ట్రాల నుంచి 500 కు మందికి పైగా లబ్ద ప్రతిష్టులైన కళాకారుల ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. గాత్రం, వయొలిన్, వీణ, వేణునాదం,మాండొలిన్ మృదంగం, ఘటం, కంజీర, మోర్సింగ్ వంటి వాయిద్యాలతో త్యాగరాజ పంచరత్న సేవను అత్యంత వేడుకగా నిర్వహించారు. ముఖ్యంగా ప్రఖ్యాత మృదంగ విద్వాంసుడు పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావు శిష్య బృందం చేసిన కచేరి ఆహుతులను కట్టిపడేసింది. ప్రవచన చక్రవర్తి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు త్యాగరాజ ఆరోధనోత్సవానికి విచ్చేసి త్యాగరాజ స్వామి పై చేసిన ప్రవచనం విశేషంగా ఆకట్టుకుంది. కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు తోపాటు కాకినాడ నగరానికి చెందిన అనేకమంది ప్రముఖులు ఈ కార్యక్రమానికి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆద్యంతం కన్నుల పండుగ కొనసాగింది. రాష్ట్రంలోనే తొలిసారిగా వివిధ ప్రాంతాల నుంచి ఒకే వేదికపై 500 మంది ఇటువంటి అద్భుత ప్రదర్శనివ్వడం తొలిసారిగా అక్కడి నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన కళాకారులంతా సాంప్రదాయ దుస్తులతో హాజరై ఆకట్టుకున్నారు. సరస్వతి గానసభ జీవితకాల చైర్మన్ కొమిరెడ్డి శ్రీరామ నరసింగరావు, గౌరవాధ్యక్షులు పెద్దాడ సూర్య కుమారి, అధ్యక్షులు డాక్టర్ ముళ్లపూడి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు లక్కరాజు సత్యనారాయన్,కార్యదర్శి పేపకాయల రామకృష్ణ, సహాయ కార్యదర్శి చెరుకువాడ సత్యనారాయణ వంటి ప్రముఖులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. డాక్టర్ ఐవీ రావు, ఎన్ సీఎస్ మురళి తో పాటు అనేకమంది నగర ప్రముఖులు ఈ కార్యక్రమాన్ని తిలకించారు. కాకినాడ పరిసర ప్రాంతాలకు చెందిన సంగీత ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని వీక్షించారు.

### ప్రత్తిపాడులో పేకాడుతున్న
# ముగ్గురి అరెస్టు



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రతిపాడు మండలం పోతులూరు గ్రామ శివారున పేకాట ఆడుతున్న వారిపై ప్రత్తిపాడు పోలీసు స్టేషన్ ఎస్సై లక్ష్మీకాంతం తన సిబ్బందితో కలిసి ఆదివారం దాడి చేసారు. ముందస్తు సమాచారంతో జరిపిన ఈ దాడిలో అందుబాటులో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. 3,250 నగదును స్వాధీనం చేసుకున్నారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట గుండాట కోడిపందాలు, జూదాలు, అసాంఘిక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదని వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై లక్ష్మీకాంతం నిందితులను హెచ్చరించారు.

# బాదం ఐ బ్యాంక్‌కు 19వ వార్షికోత్సవ వేడుకలు



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ ఎన్ఎఫ్సీఎల్ రోడ్డులోని బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ 19వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె.నరసింహ నాయక్ హాజరై ప్రసంగించారు. మన తెలుగు రాష్ట్రాల్లో నాలుగు ప్రధాని బ్యాంకుల్లో బాదం ఐ బ్యాంక్ ఉండడం కార్యక్రమం నగరానికి గర్వకారణమని నాయక్ పేర్కొన్నారు జిల్లా అంధత్వ నివారణ డీపీఎం డాక్టర్ వి.శ్రీవిద్య మాట్లాడుతూ 18 సంవత్సరాల నుండి కార్నియల్ అందరితో నివారణకు ఎంతగానో కృషి చేసిన ఐ బ్యాంకు ధన్యవాదాలు తెలిపారు. కళ్లద్దాల దానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐ బ్యాంక్ చైర్పర్సన్ దామెర్ల విజయలక్ష్మి, వైస్ చైర్మన్ కొల్లేపల్లి మురళీకృష్ణ, కార్యదర్శి బాదం బాలకృష్ణ, జాయింట్ సెక్రటరీ ఎం. రజని కుమారి, ట్రెజరర్ దాసరి సాయి కృష్ణలు మాట్లాడారు. గత 18 సంవత్సరాలుగా నిరంతర సేవలతో వేలాది మంది దృష్టి లోపితులకు చూపు ప్రసాదించినట్లు తెలిపారు. చూపు పొందిన కార్నియా గ్రహీతలను సభకు పరిచయం చేయడంతో ఆ కుటుంబ సభ్యులు ఆనంద వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పైడా వెంకట నారాయణ, బాదం చంద్రశేఖర్, వెంకట సూర్యారావు, శంకరరావు, దాట్ల రవి, రావుల శ్రీరామ్, లయన్ ఎస్ చంద్రశేఖర్, వాడ్రేవు రవి, గొల్లపూడి కృష్ణమూర్తి, జివిఎస్ గాంధీజీ, ప్రగడపాటి కనకరాజు, పైడా సోమేశ్వరరావు, సీమకుర్తి పాపారావు, టి రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నేత్రదానం ద్వారా మరణానంతరం కూడా ఇతరులకు వెలుగునివ్వవచ్చని, ప్రజలు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి కళ్లద్దాల దానం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.



# అట్టహాసంగా ప్రారంభమైన ఆర్ఎంసి కార్నివాల్

## సాంస్కృతిక వికాసానికి, కళా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట : మంత్రి కందుల దుర్గేష్





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రవరంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కార్నివాల్ నిర్వహించుకోవడం సంతోషదాయకమని రాష్ట్ర పర్యటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రెండు రోజుల పాటు నగరంలో నిర్వహిస్తున్న ఆర్ఎంసి కార్నివాల్‌ను శనివారం సుబ్రహ్మణ్య మైదానం నందు ఘనంగా ప్రారంభించారు. కళ్లు మిరుమిట్లు గొలిపే కాంతుల మధ్య "ఫుడ్ – మ్యూజిక్ – ఫన్" థీమ్‌తో ఏర్పాటు చేసిన మ్యూజిక్ కన్సర్ట్స్, విభిన్న రకాల ఫుడ్ స్టాళ్లు, చిన్నారులకు వినోదాన్ని పంచే ఆటలు, సెల్ఫీ బూత్‌లు సందర్శకులను విశేషంగా ఆకర్షించాయి. ఈ సందర్భంగా మంత్రి, కలెక్టర్ ,శాసన సభ్యులు తదితరులు స్టాళ్లను సందర్శించి సంప్రదాయ వంటకాలను రుచి చూశారు. అనంతరం సంగీత కళాకారుల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణం పేరుతో ప్రారంభమైన ఈ మైదానంలో ఇలాంటి అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం ఆనందదాయకమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ కార్నివాల్ నగరానికి పండుగ శోభను తీసుకు వచ్చిందని అభివర్ణించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు కుటుంబ సమేతంగా ప్రజలందరూ పాల్గొని ఆనందించేలా నగరపాలక సంస్థ ఈ వేడుకలను నిర్వహించడం అభినందనీయమన్నారు. దైనందిన జీవితంలో ప్రజలు నిత్యం ఒత్తిళ్లకు లోనవుతూ సాంస్కృతిక వికాసానికి దూరమవుతున్నారని మంత్రి తెలిపారు. ఇటువంటి తరుణంలో ప్రజల్లో నూతన ఉత్సాహాన్ని నింపడంతో పాటు రాజమహేంద్రవరానికి ఉన్న గత వైభవాన్ని పునఃప్రారంభించేందుకు ఈ కార్నివాల్ ఒక చక్కని ప్రయత్నమని అన్నారు. ఆంధ్రా రుచులతో పాటు స్థానిక కళాకారులను ప్రోత్సహించే విధంగా స్టాళ్లను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కళల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కళలను మరియు కళాకారులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉగాది పురస్కారాల నుంచి ప్రతినెలా ఒక రాష్ట్ర పండుగను నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో 2027 పుష్కరాల వరకు ప్రతినెలా నగరంలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా రాజమహేంద్రవరానికి ఉన్న గత వైభవాన్ని నిలబెట్టుకుందామని మంత్రి పిలుపునిచ్చారు. అలాగే ఆనం కళాకేంద్రంలో గతంలో నిర్వహించిన నంది నాటకోత్సవాల వంటి కార్యక్రమాలను మళ్లీ ప్రారంభించి, కళాకారులకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రవరంలో కళలు, కళాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్నివాల్ నగరవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు సాంస్కృతిక అనుభూతులను అందిస్తోందని పేర్కొన్నారు. ప్రజలు కుటుంబ సమేతంగా పాల్గొని ఆనందించేలా ఈ కార్యక్రమాలు నగరానికి పండుగ శోభను తీసుకువచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, ఆర్డీఓ ఆర్. కృష్ణ నాయక్, అడిషనల్ ఎస్పీ డి. మురళీకృష్ణ, ఆర్ఎంసి అడిషనల్ కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ దాసరి ప్రియా సౌజన్య, ఏపీ శెట్టిబలిజ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు, ఇతర అధికారులు మరియు పెద్ద సంఖ్యలో నగర ప్రజలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ లేకుంటే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేది కాదు

- ఘనంగా అఖిల భారత కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం
- పార్టీకి అంకితభవంతో పనిచేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులకు సన్మానం
- పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ లేకుంటే భారత దేశానికి స్వతంత్రం వచ్చేది కాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు టీకే విశ్వేశ్వర రెడ్డి అన్నారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి అంకిత భావంతో పనిచేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు డాక్టర్ టీ.కే విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎందరో త్యాగధనులు తమ ప్రాణాలు పణంగా పెట్టి దేశానికి స్వాతంత్రం తీసుకు వచ్చారని అన్నారు. దేశానికి స్వాతంత్రం సమర్పార్జనకు కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేసి కొందరు నాయకులు తమ ఆస్తులను కూడా పోగొట్టుకున్నారని వివరించారు. బ్రిటిష్ వారికి తొత్తులుగా వ్యవహరించిన ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకులు ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్నారని అన్నారు. మహాత్మా గాంధీని చంపిన వ్యక్తి గాడ్సే అయితే, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చిన ప్రధాని మోడీ రెండవ గాడ్సే అని విమర్శించారు. జనవరి 5వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం మార్చడాన్ని నిరసిస్తూ ఉద్యమం చేపడతామని అన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం వలన ఒక్కొక్క రాష్ట్రానికి రూ.5 వేల కోట్లు భరించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ఎంపీ పురందేశ్వరికి ఏ పార్టీ వలన కేంద్ర మంత్రి పదవి వచ్చిందో ఆమె గ్రహించాలని సూచించారు. రాజమండ్రి కి గెస్ట్ ఆర్టిస్ట్ ల వచ్చి కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పత్రికా ప్రకటన ఇస్తున్న ఇద్దరినీ సస్పెండ్ చేస్తామని అన్నారు. పార్టీలో చీడపురుగుల్ని కొనసాగడానికి అవకాశం లేదని హెచ్చరించారు. కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడంతో పాటు,రాష్ట్రంలో షర్మిల రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు బాలేపల్లి మురళి మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో ప్రాణాలు ప్రాణంగా పెట్టి, ఆస్తులను ధారపోసి దేశానికి స్వతంత్రం తీసుకు వచ్చారని అన్నారు పార్టీ ఆవిర్భవించి 140 సంవత్సరాలు అయిన సందర్భంగా ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఏ పార్టీ ఉద్భవించిన కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిందేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్టిన్ లూథర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కువగా పాలన చేసిన ప్రధాని జవహర్లాల్ నెహ్రూ అని అన్నారు. దేశం అభివృద్ధి ఆయన పాలనలోనే జరిగిందని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు రాహుల్ గాంధీ జూడో యాత్ర దేశవ్యాప్తంగా చేశారని తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం కార్యదర్శి అరిగెల అరుణ్ కుమారి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేర్లు మార్చి బిజెపి ప్రభుత్వం చిల్లర రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. బ్రిటిష్ వారిని దేశం నుంచి ఎలా తరిమికొట్టామో బిజెపి ప్రభుత్వాన్ని కూడా అలాగే దేశం నుంచి తరిమికొట్టాలని పిలుపు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.

**సీనియర్‌లకు ఘన సన్మానం :**

కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో పనిచేసిన సీనియర్ నాయకులు రఫీ ఉల్లా బేగ్‌కు, కాకర్ల హరిబాబు, వెలగరామకృష్ణ, సత్యనారాయణ, చింతాడ వెంకటేశ్వరరావు, బత్తిన చంద్రావు,మోత శారద, చామర్తి లీలావతి,డాక్టర్ వడియార్,అరిగెల అరుణ్ కుమారి,బాలేపల్లి మురళీ తదితరులకు ఘనంగా సన్మానించారు.

# మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారత దిశగా అడుగులు

## ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్... కమిషనర్ రాహుల్ మీనా క్వారీ మార్కెట్ సెంటర్లో డీజీ లక్ష్మీ కామన్ సర్వీస్ సెంటర్ ప్రారంభం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలకు డిజిటల్ సేవలు అందిస్తూ, పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా పరిపుష్టి సాధించేలా డీజీ లక్ష్మి పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. క్వారీ మార్కెట్ సెంటర్ వద్ద డీజీ లక్ష్మీ కామన్ సర్వీస్ సెంటర్ ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కమిషనర్ రాహుల్ మీనా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పొదుపు సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. స్వయం సహాయక సంఘం సభ్యులు ఆర్థికంగా ఎదగడానికి డీజీ లక్ష్మి ఎంతో మంచి అవకాశమన్నారు. ఈ సెంటర్ ద్వారా విద్యుత్ బిల్లులు, ఆస్తి, నీటి పన్ను, రైలు, బస్సు టికెట్లు, టెలిఫోన్ బిల్లు, కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలు, బీమా చెల్లింపులు, వ్యవసాయం, ఆరోగ్యం తదితర 250 రకాల సేవలు పొందవచ్చన్నారు. తొలుత జిల్లాకో మోడల్ సెంటర్ ను ఏర్పాటు చేస్తుండగా.. తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి నగరంలోని క్వారీ మార్కెట్ సెంటర్లో ప్రారంభించుకున్నట్లు వెల్లడించారు. త్వరలో మరో 261 సెంటర్లు నగరవ్యాప్తంగా అందుబాటులోకి రానున్నట్లు వివరించారు. మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారత దిశగా కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘం సభ్యులు ప్రజలకు డిజిటల్ సేవలందించి తద్వారా ఆర్థికంగా స్థిరపడాలనే ఉద్దేశంతో డీజీ లక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టడం జరగిందన్నారు. దీని ద్వారా ప్రతినెల రూ. 30 వేల నుంచి 40 వేల వరకు ఆదాయం ఆర్జించే అవకాశం ఉంటుందన్నారు. అలాగే కియోస్క్, ప్రింటర్ తదితర పరికరాల కొనుగోలుకు రూ.2.92 లక్షల రుణం ఇస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకుని పొదుపు సంఘాల మహిళలు జీవన ప్రమాణాలు మెరుగుపరచుకోవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, నగర పాలక అధికారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాతేరులో స్వచ్ఛ భారత్

## వాలంటీర్లు ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి, మొక్కలు నాటారు



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదిత్య డిగ్రీ కళాశాలలకు చెందిన జాతీయ సేవా పథకం, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు, అలాగే ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సభ్యులు కలిసి సచివాలయం-5, ఇండస్ట్రియల్ కాలనీ, కాతేరు ప్రాంతంలో స్వచ్ఛ భారత్ మరియు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి, చెత్తను. అవసరం లేని మొక్కలను తొలగించి, సచివాలయం ప్రాంగణంలో పది అడుగుల ఎత్తు కలిగిన ఇరవై మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు నాయకులు జక్కంపూడి నాగ కొండలరావు, మాచిరెడ్డి చిన అప్పలనాయుడు, కె.అచిబాబు, వై.ప్రసాద్, రాంబాబు,ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సభ్యులు కె.సుధాకర్ పట్నాయక్, ఆజాద్రాజు, చందన రాజు, ఆదిత్య కళాశాల సిబ్బంది బి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డా. జి.వి.ఎస్. నాగేశ్వరరావు, పోలుకొండ సాయి, బి.విమల, డా. బి.వి.రమాదేవి వారి మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందించారు.

# నేడే జిల్లా మహిళల కబడ్డీ జట్టు ఎంపిక

## తూర్పుగోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బురిడి త్రిమూర్తులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళల కబడ్డీ జట్టు ఎంపిక జరుగుతుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి బురిడి త్రిమూర్తులు గారు తెలిపారు.నేడు సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి స్థానిక ఎస్‌కేవిటి డిగ్రీ కాలేజీలో మహిళల జట్టు ఎంపిక జరుగుతుందని, తూర్పు గోదావరి జిల్లాలోని 19 మండలాల్లో ఉన్న కబడ్డీ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పాల్గొనాలని ఆయన కోరారు. కబడ్డీ క్రీడాకారులు 75 కేజీలలోపుఉండాలని, తమ ఆధార్ కార్డు తప్పనిసరిగాతీసుకొని రావాలని ఆయన తెలిపారు.జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు జనవరి 2 నుంచి 5వ తేదీ వరకు వెస్ట్ గోదావరి జిల్లాలోని వీరవాసరం గ్రామంలో జరిగే అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని బురిడి త్రిమూర్తులు తెలియచేశారు. ఇతర వివరాలకు 98487 35152 నెంబరులో తనను సంప్రదించవచ్చని ఆయన కోరారు.

# దేశ నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర విలువైనది

## కో-ఆర్డినేటర్ మేడవరపు భద్రందొర



**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదివారం ఉదయం అఖిల భారత కాంగ్రెస్ పార్టీ141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కో-ఆర్డినేటర్ మేడవరపు భద్రందొర ఆధ్వర్యంలో స్థానిక నిడదవోలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు కాంగ్రెస్ ఆవిర్భావ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం భద్రందొర మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమకారులు చేత స్థాపించిన పార్టీ ఎందరో మహానుభావులు ఈదేశం స్వాతంత్ర్యం పోరాటంలో పాల్గొన్నారు. ఈదేశానికి దశ,దిశ మార్గాలను చేపట్టి, దేశ నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఉంది అని అన్నారు.ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం నందు స్వీట్లు, ఫ్రూట్స్ పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో చిన్నం మురళీ కృష్ణ,అగర్వాల్ హీరాలాల్,భావన రమేష్ బాబు,బుద్దన లక్ష్మణరావు, షేక్ బషీర్,కాకి కిషోర్, పుచ్చకాయల వరప్రసాద్, ప్రగాళ్లపాటి భాస్కర్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 30న రాజానగరం స్కిల్ హబ్లో జాబ్ మేళా

## నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు
## జిల్లా ఉపాధి అధికారి కె. హరీష్ చంద్ర ప్రసాద్ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.డి. జీ.మురళి





**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం మండల ప్రజా పరిషత్ స్కిల్ హబ్ ప్రాంగణంలో ఉపాధి మరియు నైపుణ్యాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె. హరీష్ చంద్ర ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. ఈ జాబ్ మేళా డిసెంబర్ 30వ తేదీ (మంగళవారం) ఉదయం 10:30 గంటలకు మండల ప్రజా పరిషత్ ప్రాంగణంలో స్కిల్ హబ్ నందు జరగనుందనీ అయన తెలియచేశారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ రాజేంద్ర ఎనర్జీ పవర్ సొల్యూషన్,ఫోన్ పే మరియు ఎస్‌బిఐ, అర్‌బిఎల్ క్రెడిట్ కర్డ్స్ సంస్థలలోని పలు ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయనీ వి.డి.జీ మురళి పేర్కొన్నారు.పది, ఐటిఐ, 12వ తరగతి నుండి డిగ్రీ వరకు చదివిన అభ్యర్థులు, అలాగే అనుభవం ఉన్నవారు లేదా ఆసక్తిగలవారు 19 నుండి 30 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటే అర్హులు అన్నారు. ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తామని తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగానే నైపుణ్యం పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలనీ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.డి.జీ. మురళి తెలిపారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు బయో డేటా, ఆధార్ కార్డు, విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకునీ రావాలని సూచించారు.మరిన్ని వివరాలకు 9533221189 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలియచేశారు.

# సుంకర వీరశేఖర్‌కు విశిష్ట పురస్కారం



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ వినియోగదారుల దినోత్సవం - 2025 సందర్భంగా విజయవాడ కలెక్టరేట్ లో 24వ తేదీ జరిగిన సమావేశంలో సమాజ సేవాతత్పరులు, వినియోగదారుల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్న సుంకర వీరశేఖర్ కు కలెక్టర్ శ్యాంప్రసాద్ చేతులు మీదుగా విశిష్ట పురస్కారం పొందారు. వినియోగదారుల వ్యవహారాలు ఆహార మరియు పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఈ సమావేశం ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగింది. డిజిటల్ న్యాయపాలన ద్వారా సమర్థ సత్వర పరిష్కారం ఇతివృత్తంగా జరిగిన ఈ సమావేశంలో వీరశేఖర్ విశిష్ట పురస్కారం పొందడం విశేషం. వారి ప్రతిభా పాటవాలను, సేవా తత్పరత ను, వినియోగదారుల సమస్యలపై గల అవగాహనతో సమస్యల సత్వర పరిష్కారాన్ని ఎంతో సమర్థవంతంగా చేయడాన్ని పలువురు కొనియాడారు. వినియోగదారుల హక్కులలో ప్రధానంగా భద్రతా హక్కు,సమాచార హక్కు,ఎంపిక హక్కు పరిష్కార హక్కు వినిపించుకునే హక్కు, వినియోగదారుల అవగాహన హక్కులున్నాయివీరశేఖర్ తెలియజేస్తూ వినియోగదారుడు వారి హక్కులను తెలుసుకొని శక్తివంతులు కావాలని, దేశంలో వినియోగదారుల రక్షణ గురించి మరింత అవగాహన కలిగి ఉండాలని ఉద్బోధించారు. వీర శేఖర్‌ను పలువురు పెద్దలు, మిత్రులు విశేషంగా అభినందించారు.

# దేవాంగ సంఘీయులకు అభినందన సత్కారం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజేంద్రనగర్ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు అల్లంకి మణికంఠ అధ్యక్షతన ఆదివారం రాజేంద్రనగర్ మండల పరిషత్ పాఠశాల వద్ద ఉన్న గణపతి ఆలయం ఆవరణలో సమావేశం నిర్వహించారు. రాజేంద్రనగర్ దేవాంగ సంఘం నుండి ఇటీవల ఉన్నత పదవులు పొందిన సంఘీయులను చిరు సత్కారంతో గౌరవించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పెద్దలు గౌరవ సలహాదారు నల్లా రామారావు, అధ్యక్షులు అల్లంకి మణికంఠ మాట్లాడుతూ గౌరవ అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులుగా, గౌరవ సలహాదారు కాలేపు సాయిరామ్ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, మరొక గౌరవ సలహాదారు పిచ్చుక అనిల్ కుమార్,ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాజమండ్రి యూనిట్ అధ్యక్షులుగా, సంఘ కార్యదర్శి ఆశపు శ్రీనివాస్ బుజ్జి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా, మరియు మహిళా సభ్యురాలు అయిన కొండపల్లి శ్రీదేవి జంపేట ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం డైరెక్టర్‌గా పదవులు రావడం మన రాజేంద్రనగర్ దేవాంగ సంక్షేమ సంఘంకు అలాగే మన సంఘీయులందరికీ ఎంతో గర్వకారణం అని అన్నారు. ప్రతీ ఒక్కరు అన్ని రంగాలలో ఉన్నత స్థాయిలో చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారు రెడ్డి శ్రీనివాస్, కొడమటి బవ్రాజు, కాలేపు ప్రసాదరావు, మావూరి సాంబశివరావు, గుంటముక్కల కుమార్ వేగు, కాలేపు శేఖర్, గుత్తి నాగు,గుంటముక్కల సత్తిబాబు,గుంటముక్కల సోము, కాలేపు వాసు, కటకం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# మహేష్ బాబుకు టెన్షన్‌గా ఉన్నప్పుడు ఏం చేస్తారంటే..



మహేష్ బాబు.. ప్రస్తుతం వారణాసి సినిమాతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న ఈ మూవీ పై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. ఇందులో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుండగా.. మలయాళీ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పుడు వారణాసి సినిమాతో బిజీగా ఉన్నారు. ఈ మూవీపై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. గుంటూరు కారం సక్సెస్ తర్వాత మహేష్ నటిస్తున్న సినిమా ఇది. అలాగే ఈ చిత్రానికి డైరెక్టర్ ఎస్ ఎస్ రాజమౌళి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో ప్రియాంక చోప్రా మందాకిని పాత్రలో నటిస్తుండగా.. మలయాళీ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కుంభ పాత్రలో కనిపించనున్నారు. ఈ మూవీలో మహేష్ హాలీవుడ్ హీరో లుక్ లో కనిపించనున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ మరిన్ని అంచనాలు పెంచేసింది. అయితే తన ప్రతి సినిమా విడుదలకు ముందు మహేష్ ఎంతో టెన్షన్ పడుతుంటారు. ప్రతి సినిమాను తన మొదటి సినిమాలాగే భావిస్తారట. అలాగే సినిమా విడుదల సమయంలోనూ ఎంతో టెన్షన్ పడుతుంటారు. ఒకప్పుడు మహేష్ తన సినిమా విడుదలకు ముందు తన తల్లి ఇందిరా దేవి వద్దకు వెళ్లేవారట. ఆమె చేతితో చేసే కాఫీ తాగి రిలాక్స్ అయ్యేవారట. అమ్మ చేతి కాఫీ తాగితే టెన్షన్ తగ్గేదని.. ఆ సమయంలో తాను ఎంతో ప్రశాంతంగా ఉంటుందట. ఈ విషయాన్ని మహేష్ బాబు గతంలో అన్ స్టాపబుల్ షోలో వెల్లడించారు. అమ్మ చేతి కాఫీ తాగితే తన టెన్షన్ మొత్తం తగ్గుతుందని బాలయ్యతో పంచుకున్నారు మహేష్. ప్రస్తుతం మహేష్ చేతిలో వారణాసి సినిమా మాత్రమే ఉంది. గ్లోబల్ రేంజ్ లో రూపొందిస్తున్న ఈ ప్రాజెక్టు కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రాన్ని 2027లో విడుదల చేయనున్నారు.

# వయసు 60 ఏళ్లు.. ఇప్పటికీ తగ్గని డిమాండ్.. సల్మాన్ ఖాన్ ఆస్తులు ఎంతంటే..



బాలీవుడ్ ఇండస్ట్రీలో టాప్ హీరోలలో సల్మాన్ ఖాన్ ఒకరు. దశాబ్దాలుగా ఎన్నో సూపర్ హిట్లతో సినీరంగంలో తనదైన ముద్ర వేశారు. డిసెంబర్ 27న సల్మాన్ ఖాన్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయనకు సోషల్ మీడియా వేదికగా అభిమానులు, సెలబ్రెటీలు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సల్మాన్ పర్సనల్ విషయాలు నెట్టింట తెగ వైరలవుతున్నాయి. బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ ఫాలోయింగ్ గురించి తెలిసిందే. హిందీతోపాటు తెలుగులోనూ మంచి ఫాలోయింగ్ సొంతం చేసుకున్నారు. డిసెంబర్ 27న సల్మాన్ 60వ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయనకు సోషల్ మీడియా వేదికగా అభిమానులు విషెస్ తెలిపారు. అలాగే ముంబైలోని తన నివాసం వద్దకు భారీగా చేరుకున్న ఫ్యాన్స్ తమ ఫేవరెట్ హీరో బర్త్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. మార్చిలో అమీర్ ఖాన్, నవంబర్‌లో షారుఖ్ ఖాన్ తర్వాత 2025లో 60 ఏళ్లు నిండిన ఖాన్‌ల జాబితాలో సల్మాన్ చేరారు. ఈ హీరో తన పుట్టిన రోజు వేడుకలను పన్వెల్ ఫామ్‌హౌస్‌లో నిర్వహించారు. ఈ వేడుకలో క్రికెటర్ ఎంఎస్ ధోని, సెలబ్రెటీస్ సైతం పాల్గొన్నారు. నివేదికల ప్రకారం సల్మాన్ ఆస్తులు రూ.29000 కోట్లు. సినిమాలతోపాటు టెలివిజన్, ఎండార్స్‌మెంట్‌లు, వ్యాపార సంస్థల నుంచి భారీగానే సంపాదిస్తున్నారు. అలాగే అతడు ఒక్కో సినిమాకు దాదాపు రూ. 100 నుండి రూ. 150 కోట్లు వసూలు చేస్తారట. కొన్ని సందర్భాల్లో రెమ్యునరేషన్ తోపాటు లాభాలు తీసుకుంటారు. అతడు ఎండార్స్‌మెంట్‌ల ద్వారా రూ. 60 కోట్లకు పైగా సంపాదిస్తున్నట్లు సమాచారం. అలాగే తన సొంత నిర్మాణ సంస్థలు సల్మాన్ ఖాన్ ఫిల్మ్స్, ఎస్‌కెఎఫ్ ఫిల్మ్స్ ద్వారా కూడా సంపాదిస్తున్నారు. ముంబైలోని బాంద్రాలో ఉన్న గెలాక్సీ అపార్ట్‌మెంట్స్ ఉన్నాయి. దీని విలువ సుమారు రూ. 100 కోట్లు ఉంటుందని అంచనా. 5 బిహెచ్‌కె గోరై బీచ్ హౌస్ , వర్లి, కార్టర్ రోడ్ వంటి ప్రాంతాలలో ఇళ్ళు, దుబాయ్‌లోని బుర్జ్ పసిఫిక్ టవర్స్, ది అడ్రస్ డౌన్‌టౌన్ వంటి ప్రదేశాలలో విలాసవంతమైన నివాసాలు ఉన్నాయి.

# నిధి పాపని పెళ్లి చేసుకోవాలంటే ఎంత ఆస్తి ఉండాలి..?

## ప్లకార్డుతో అభిమాని.. నిధి రియాక్షన్ ఎంటంటే..



ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో టాప్ మోస్ట్ డిమాండ్ ఉన్న హీరోయిన్లలో నిధి అగర్వాల్ ఒకరు. చాలా కాలంగా సరైన బ్రేక్ వెయిట్ చేస్తున్న నిధి.. ఇటీవలే హరి హర వీరమల్లు సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చింది. ఇప్పుడు రాజాసాబ్ మూవీతో మరోసారి థియేటర్లలో సందడి చేయనుంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా రిలీజ్ చేయనున్నారు. ప్రస్తుతం నిధి అగర్వాల్ పేరు సోషల్ మీడియా తెగ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే సరైన హిట్టు కోసం వెయిట్ చేస్తూనే వరుస అవకాశాలు అందుకుంటుంది ఈ అమ్మడు. ఇప్పుడు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న రాజా సాబ్ చిత్రంలో నటిస్తుంది నిధి. ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల చేయనున్నారు. డైరెక్టర్ మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ హారర్ కామెడీ డ్రామాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. శనివారం రాత్రి జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ లో మార్మోగిపోయింది. రాజా సాబ్ ప్రీ రిలీజ్ వేడుకలో నిధి అగర్వాల్ ను ఉద్దేశిస్తూ ఓ అభిమాని ప్లకార్డు పట్టుకుని అందరిని ఆశ్చర్యపరిచాడు. 'నిధి పాపను పెళ్లి చేసుకోవాలంటే ఏ వృత్తిలో ఉండాలి.. ఎంత ఆస్తి ఉండాలి.. ఎలా ఉండాలి' అని రాసి ఉన్న ప్లకార్డ్ పట్టుకుని నిలబడ్డాడు. అది చూసిన యాంకర్ సుమ, హీరో ప్రభాస్ సహా అందరూ ఆశ్చర్యపోయారు. ఇదే విషయాన్ని యాంకర్ సుమ నిధి దగ్గర ప్రస్తావించగా.. ప్రొఫెషన్ ఆఫ్ లవ్ లో ఉండాలంటూ చెప్పుకొచ్చింది. అలాగే ఈ వేదికపై నిధి మాట్లాడిన తర్వాత చీరలోనే అన్ని నిధులూ ఉన్నాయని కామెంట్ చేసింది సుమ. సుమ మాటతో ఈవెంట్ లో విజిల్స్ తో మార్మోగిపోయింది. ప్రస్తుతం నిధి చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. రాజాసాబ్ సినిమాపై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. జనవరి 9న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా లెవల్లో విడుదల చేయనున్నారు.

# అబ్బా జర్రుంటే చచ్చిపోతుంటివి గదరా..

## బిగ్ బాష్ లీగ్‌లో తప్పిన పెను ప్రమాదం..వీడియో వైరల్!



ఆస్ట్రేలియా వేదికగా జరుగుతున్న బిగ్ బాష్ లీగ్?లో ఆదివారం ఒక భయానక దృశ్యం కనిపించింది. మెల్బోర్న్ స్టార్స్, సిడ్నీ థండర్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒకే క్యాచ్ కోసం ఇద్దరు ఫీల్డర్లు ఒకరికొకరు అనుకోకుండా ఎదురెదురుగా దూసుకువచ్చారు.ఆస్ట్రేలియా వేదికగా జరుగుతున్న బిగ్ బాష్ లీగ్?లో ఆదివారం ఒక భయానక దృశ్యం కనిపించింది. మెల్బోర్న్ స్టార్స్, సిడ్నీ థండర్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒకే క్యాచ్ కోసం ఇద్దరు ఫీల్డర్లు ఒకరికొకరు ఎదురెదురుగా దూసుకువచ్చారు. పాకిస్థాన్ స్పీడ్‌స్టర్ హారిస్ రౌఫ్, ఆస్ట్రేలియా ప్లేయర్ హిల్టన్ కార్ట్‌రైట్ తలలు పగిలేంత ప్రమాదం తృటిలో తప్పింది. దీంతో మైదానంలో ఉన్న ఆటగాళ్లతో పాటు ప్రేక్షకులు కూడా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు.

**మైదానంలో అసలేం జరిగిందంటే..**

సిడ్నీ థండర్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో ఈ ఘటన జరిగింది. టామ్ కరన్ వేసిన బంతిని బ్యాటర్ గాల్లోకి లేపాడు. అది బ్యాక్ వర్డ్ పాయింట్, డీప్ పాయింట్ మధ్యలో పడబోయింది. ఆ క్యాచ్‌ను అందుకోవడానికి పాయింట్‌లో ఉన్న హారిస్ రౌఫ్ వెనక్కి పరిగెత్తగా, బౌండరీ దగ్గర ఉన్న కార్ట్‌రైట్ ముందుకు దూసుకువచ్చాడు. ఇద్దరూ కేవలం బంతిపైనే కళ్లు పెట్టి వేగంగా ఎదురెదురుగా రావడంతో పెను ప్రమాదం పొంచి ఉంది. ఇద్దరూ ఒకేసారి క్యాచ్ కోసం డైవ్ చేయబోయారు.

**సమయస్ఫూర్తితో తప్పిన ముప్పు**

సరిగ్గా డైవ్ చేసే క్షణంలో కార్ట్‌రైట్ అప్రమత్తమయ్యాడు. హారిస్ రౌఫ్ తన వైపే వస్తున్నాడని గమనించి, చివరి సెకనులో తన డైవ్‌ను పక్కకు మళ్లించాడు. లేదంటే ఇద్దరి తలలు బలంగా ఢీకొనేవి. క్యాచ్ అయితే మిస్ అయ్యింది కానీ, ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ అవుతోంది. ఆటగాళు క్యాచ్‌ను అందుకోవడంలో చూపే అత్యుత్సాహం ఒక్కోసారి కెరీర్‌కే ముప్పు తెస్తుందని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది.

**హారిస్ రౌఫ్ సూపర్ స్పెల్**

ప్రమాదం తప్పినప్పటికీ, అంతకుముందు హారిస్ రౌఫ్ తన బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. రౌఫ్ నిప్పులు చెరిగే బంతులకు సిడ్నీ థండర్ బ్యాటర్లు విలవిలలాడారు. రౌఫ్ 3 వికెట్లు పడగొట్టి సిడ్నీని 128 పరుగులకే కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం మెల్బోర్న్ స్టార్స్ బ్యాటర్లు జో క్లార్క్ (60), గ్లెన్ మాక్స్‌వెల్ (39) రెచ్చిపోవడంతో మెల్బోర్న్ జట్టు 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. రౌఫ్ తన స్పీడ్ తో మ్యాచును మలుపు తిప్పాడు.

# స్టేడియంలో క్యాచ్ పడితే.. బ్యాంకులో కోట్లు పడ్డాయి..అదృష్టం అంటే ఈ కుర్రాడిదే బాసూ!



దక్షిణాఫ్రికా ఎస్ఎ 20 లీగ్‌లో ఒక అభిమాని ఒక చేత్తో క్యాచ్ పట్టి రూ. 1.08 కోట్లు గెలుచుకున్నాడు. దర్బన్ సూపర్ జెయింట్స్, ఎంఐ కేప్ టౌన్ మధ్య జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఈ అరుదైన ఘటన చోటుచేసుకుంది.సాధారణంగా స్టేడియానికి వెళ్లే అభిమానులు తమ అభిమాన ఆటగాళ్లను చూసి మురిసిపోతారు. కానీ సౌతాఫ్రికాలో జరుగుతున్న ఎస్ఎ20 లీగ్ లో ఒక అభిమాని మాత్రం ఏకంగా కోటీశ్వరుడిగా మారిపోయాడు. మైదానం వెలుపల స్టాండ్స్‌లో కూర్చుని అతను పట్టిన ఒక్క వన్ హ్యాండెడ్ క్యాచ్ అతని దశను మార్చేసింది. క్రికెట్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన క్యాచ్‌లలో ఒకటిగా నిలిచిన ఈ ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. దర్బన్ సూపర్ జెయింట్స్, ఎంఐ కేప్ టౌన్ జట్ల మధ్య శుక్రవారం జరిగిన మ్యాచ్ రికార్డులకు వేదికైంది. మొదట బ్యాటింగ్ చేసిన దర్బన్ జట్టు నిర్ణీత ఓవర్లలో 232/5 భారీ స్కోరు సాధించింది. ఇది ఎస్ఎ20 చరిత్రలోనే అత్యధిక స్కోరు. కివీస్ ద్వయం డెవాన్ కాన్వే (64), కేన్ విలియమ్సన్ (40) మెరుపు ఆరంభాన్ని ఇవ్వగా.. ఐడెన్ మార్క్రామ్, ఇవాన్ జోన్స్ చివర్లో మెరుపులు మెరిపించారు. అనంతరం 233 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఎంఐ కేప్ టౌన్ కూడా గట్టిగానే పోరాడింది. ర్యాన్ రికెల్టన్ 113 పరుగులతో వీరోచిత సెంచరీ చేసినప్పటికీ, ఆ జట్టు 15 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. రెండు జట్లు కలిపి ఈ మ్యాచ్‌లో ఏకంగా 449 పరుగులు సాధించాయి. ఈ పరుగుల ప్రవాహంలో ర్యాన్ రికెల్టన్ కొట్టిన ఒక భారీ సిక్సర్ ఒక అభిమానిని కోటీశ్వరుడిని చేసింది. ఇన్నింగ్స్ 13వ ఓవర్లో రికెల్టన్ బంతిని స్టాండ్స్‌లోకి బాదగా.. అక్కడ కూర్చున్న ఒక యువకుడు అద్భుతమైన ఏకాగ్రతతో ఒక చేత్తో క్యాచ్ పట్టాడు. ఎస్ఎ20 లీగ్‌లో అమల్లో ఉన్న క్లీన్ క్యాచ్ ఇనిషియేటివ్ ప్రకారం.. ఒక చేత్తో క్లీన్‌గా క్యాచ్ పట్టే అభిమానులకు భారీ బహుమతి లభిస్తుంది. దీని కింద ఆ అభిమాని 2 మిలియన్ రాండ్స్ (సుమారు రూ. 1.08కోట్లు) గెలుచుకున్నాడు. స్టేడియం అంతా ఒక్కసారిగా ఆ అభిమానిని చూసి కేరింతలు కొట్టింది. సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో అభిమానులను ప్రోత్సహించేందుకు నిర్వాహకులు ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. మ్యాచ్ జరుగుతున్నప్పుడు బ్యాటర్ కొట్టిన సిక్సర్‌ను స్టాండ్స్‌లో ఉన్న ప్రేక్షకుడు ఒకే చేత్తో పట్టుకుంటే, సీజన్ ముగిసే సమయానికి కేటాయించిన భారీ మొత్తాన్ని అటువంటి క్యాచ్‌లు పట్టిన వారందరికీ పంచుతారు. ఈ మ్యాచ్‌లో ఆ యువకుడు పట్టిన క్యాచ్ అతనిని ఒక్కసారిగా వార్తల్లో నిలిచేలా చేసింది. క్రికెట్ అంటే కేవలం వినోదమే కాదు, అదృష్టం ఉంటే ఆదాయం కూడా అని ఈ ఘటన నిరూపించింది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్ CINEMA
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
విద్యా వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com